# లోకల్ గైడ్

LGTV

జాతీయ దినపత్రిక

LOCAL NEWS GOBAL FOCUS

తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్



లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com

విలేకరులు కావలెను

సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి

8977761499/9110308094



ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 15, | సంచిక 291 | పేజీలు -12 శుక్రవారం - 10 - జూలై - 2026 | వెల రూ.2/-

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal,


## ఫడ్నవీస్‌ను కాదని షిండేతో భేటీ దేనికి?



ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఎన్సీపీ అధినేత శరద్ పవార్.. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను కలవడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది. సాధారణ మర్యాదపూర్వక భేటీగానే ఇరు వర్గాలు చెబుతున్నప్పటికీ.. ఈ సమావేశం జరిగిన సమయం, కలిసిన నేతల ప్రాధాన్యం రాజకీయ చర్చలకు దారితీస్తోంది. మహారాష్ట్ర-కర్ణాటక సరిహద్దు వివాదంపై ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు

## టీ20 స్పీడ్, టెస్ట్ మ్యాచ్ లోతు.. ఆస్ట్రేలియాతో బంధంపై మోదీ క్రికెట్ వ్యాఖ్యలు!



- ఆస్ట్రేలియాతో బంధంపై ప్రధాని మోదీ ఆసక్తికర క్రికెట్ పోలికలు
- ఇరు దేశాల మధ్య కీలకమైన అణు సహకార ఒప్పందం ఖరారు
- ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించిన ఇరు దేశాల ప్రధానులు

## హరీశ్ రావు అంత నిష్ఠాతుడైతే.. కేసీఆర్ ఎందుకు తీసేశారు?: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్!



- సాగునీటి రంగంపై విమర్శలు గుప్పించిన హరీశ్ కు ఉత్తమ్ కౌంటర్
- పెద్ద నిష్ఠాతుడైనట్లు హరీశ్ మాట్లాడుతున్నారని ఎద్దేవా
- హరీశ్ విమర్శలకు సరైన సమయంలో సమాధానం చెబుతామని వ్యాఖ్య

# బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ. 1,400 కోట్లపై విచారణ జరిపించాలి: కవిత

- నిధులు స్వచ్ఛమైనవి కావన్న కవిత
- ఆ డబ్బులు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చాయని ఆరోపణ
- ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీలో చేరనని వ్యాఖ్య



# సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభం

"తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు ప్రాంతీయ మండళ్లుగా విభజించి సమగ్రమైన ప్రణాళికలతో ముందుకు వెళుతున్నాం

- "ఆ నగరాల అనుభవాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి
- తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టాలన్నది మా సంకల్పం
- 2034 నాటికి 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం
- 2047 నాటికి వంద సంవత్సరాల స్వాతంత్ర్య ఉత్సవాలను జరుపుకోబోతున్నాం
- "హైదరాబాద్ ప్రపంచంతో పోటీ పడాలంటే ఇప్పుడున్న పెట్టుబడులు, పరిశ్రమలు సరిపోవు.



హైదరాబాద్: హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు అంతర్భాగం మొత్తంగా కాలుష్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేస్తోందని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు చెప్పారు. 2,100 చ.కి.మీ మేరకు విస్తరించి ఉన్న ఓఆర్ఆర్ లోపల కోర్ అర్బన్ ఏరియాలో 1 కోటి 35 లక్షల జనాభా అవసరాలకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. సోలార్ మాడ్యూల్స్ తయారీ రంగంలో ప్రసిద్ధ ప్రిమియర్ ఎనర్జీస్ సంస్థ రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో నెలకొల్పిన 5.6 గిగావాట్ల సామర్థ్యం కలిసిన సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారితో కలిసి ముఖ్యమంత్రి గారు ప్రారంభించారు. ప్రిమియర్ ఎనర్జీ రూపొందించిన మొట్టమొదటి సోలార్ ఆక్సీ ట్రీ -- సోలార్ పవర్డ్ స్ట్రీట్ లైట్, ఎయిర్ క్లీనింగ్ సిస్టమ్ 'ఆక్సీట్రీ'ని, యూనిట్‌లో సోలార్ మాడ్యూల్స్‌కు సంబంధించి వివిధ ఉత్పత్తులను ముఖ్యమంత్రి గారు పరిశీలించారు. ఈ యూనిట్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు చెన్నై లాంటి మెట్రోపాలిటన్ నగరాలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోని కారణంగానే చాలా కష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. "ఆ నగరాల అనుభవాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి.

# మెల్‌బోర్న్‌లో మోదీకి ఘన స్వాగతం.. మార్వెల్ స్టేడియం 'హౌస్‌ఫుల్'

- ప్రధాని మోదీని విజనరీ నాయకుడిగా అభివర్ణించారు
- ఆయన నాయకత్వంలో భారత్ ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది
- ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. తనకు లభించిన ఆత్మీయ ఆతిథ్యం పట్ల ఆస్ట్రేలియా ప్రజలు, ప్రధాని అల్బనీస్‌కు కృతజ్ఞతలు
- మార్వెల్ స్టేడియంలో అభిమానుల సందడి నెలకొనడంతో 'ఈ షో హౌస్‌ఫుల్.. బ్లాక్‌బస్టర్' అని మోదీ వ్యాఖ్య



ఇంటర్నెట్ డెస్క్: ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీకి మెల్‌బోర్న్ మార్వెల్ స్టేడియంలో ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమానికి 30 వేల మందికిపైగా ఎన్ఆర్ఐలు హాజరయ్యారు. దీంతో ఒక్కసారిగా స్టేడియమంతా కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్.. మోదీని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రధాని మోదీ ప్రసంగిస్తూ..

## రాజకీయాలకు అతీతమైన బంధం.. తెలంగాణ మంత్రికి చంద్రబాబు, లోకేశ్ బర్త్‌డే విషెస్



- మంత్రి సీతక్కకు 'ఎక్స్' వేదికగా విషెస్ తెలియజేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్
- చంద్రబాబును తన రాజకీయ గురువుగా భావిస్తానని పలుమార్లు చెప్పిన సీతక్క
- పార్టీలు, రాష్ట్రాలు వేరైనా వారి మధ్య కొనసాగుతున్న గౌరవప్రదమైన అనుబంధం

## కడియం శ్రీహరిది కపట బుద్ధి.. నా శాఖను హైజాక్ చేశారు



హైదరాబాద్: మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఈ వ్యవహారంపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసిన సురేఖ తన అభ్యంతరాలను వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కడియంపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. టీవీ9తో మాట్లాడుతూ.. తాను బాధ్యతలు చూస్తున్న దేవాదాయ శాఖలోకి తనకు సమాచారం ఇవ్వకుండా కడియం వచ్చి కమిషనర్‌తో సమీక్ష నిర్వహించారని

# కియా ఈవీ హబ్, విశాఖలో ఎక్స్‌పోర్ట్ సెంటర్.. కొరియాలో మంత్రి లోకేశ్ కీలక భేటీలు

- ఏపీలో ఈవీ, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని విస్తరించాలని కియాకు లోకేశ్ ప్రతిపాదన
- విశాఖ పోర్టు సమీపంలో ఎక్స్‌పోర్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- కొరియన్ పెట్టుబడి దారులకు 3T విధానంతో రక్షణ కవచంలా ఉంటామని భరోసా
- ఏపీలో కొరియన్ కల్చరల్ సెంటర్, జాయింట్ ట్రెయినింగ్ అకాడమీల ఏర్పాటుకు సంసిద్ధత
- ఏపీ-కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్ ఏర్పాటు చేయాలని విదేశాంగ శాఖకు సూచన



అమరావతి: ఏపీకి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సియోల్‌లో ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం కియా మోటార్స్‌తో పాటు దక్షిణ కొరియా ప్రభుత్వ ఉన్నతాధికారులతో కీలక సమావేశాలు నిర్వహించారు. ఏపీని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చేందుకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, పలు వ్యూహాత్మక ప్రతిపాదనలను వారి ముందు ఉంచారు.

కియాతో ఉన్నత స్థాయి సమావేశం.. భారీ విస్తరణకు ఆహ్వానం

సియోల్‌లో కియా మోటార్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఆపరేషన్స్) టే హన్ లీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందంతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా, అనంతపురంలో ఇప్పటికే విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న కియా, రాష్ట్రంలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు. ముఖ్యంగా ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ), హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లోకేశ్ ప్రతిపాదించారు. కియా ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్న ప్లాట్‌ఫామ్ బియాండ్ వెహికల్ (పీబీవీ) వాహనాల ఉత్పత్తిని కూడా ఏపీలో చేపట్టాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్లకు సులభంగా ఎగుమతులు చేసేందుకు వీలుగా విశాఖపట్నం పోర్టు సమీపంలో ఒక సీకేడీ (కంప్లీట్లీ నాక్డ్ డౌన్) అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను

# గుటుపల్లె భూముల వివాదం.. స్వయంగా తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లిన సీఎం చంద్రబాబు



- బేతంచెర్ల మండలంలో 22ఏ జాబితాలోని భూములకు విముక్తి
- సీఎం చంద్రబాబు సమక్షంలో 2,074 ఎకరాల తొలగింపు ప్రక్రియ
- గత ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిన భూములపై నిర్ణయం
- వేల ఎకరాల వక్ఫ్, చుక్కల భూముల సమస్యలకు కూడా పరిష్కారం

## ఏపీలో కారుణ్య మరణంపై స్పష్టత.. అమల్లోకి కొత్త నిబంధనలు




- కారుణ్య మరణంపై మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా నిబంధనలు
- 'లివింగ్ విల్' ద్వారా చికిత్సపై ముందుగానే నిర్ణయం తీసుకునే అవకాశం
- రెండు దశల మెడికల్ బోర్డుల పరిశీలన తర్వాతే అమలుకు అనుమతి

లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com



## టీ20 స్పీడ్, టెస్ట్ మ్యాచ్ లోతు.. ఆస్ట్రేలియాతో బంధంపై మోదీ క్రికెట్ వ్యాఖ్యలు!

ఢిల్లీ: భారత్, ఆస్ట్రేలియా మధ్య బంధం ఎంత వేగంగా, ఎంత పటిష్ఠంగా ఉందో ప్రధాని నరేంద్ర మోదీ క్రికెట్ పోలికలతో చక్కగా వివరించారు. మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి నిర్వహించిన వార్షిక సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య నిర్ణయాలు టీ20 మ్యాచ్ అంత వేగంగా జరుగుతాయని, ఈ భాగస్వామ్యం టెస్ట్ మ్యాచ్ అంత లోతైనదని, పటిష్ఠమైనదని ఆయన అభివర్ణించారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఇండోనేషియాలో పర్యటన ముగించుకుని నిన్న మెల్‌బోర్న్‌కు చేరుకున్న ప్రధాని మోదీ, ఇవాళ అల్బనీస్‌తో కలిసి సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఇరు దేశాల ఉమ్మడి ప్రయోజనాల దృష్ట్యా వ్యూహాత్మక, ఆర్థిక, భద్రతా రంగాల్లో సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది. ప్రపంచ క్రీడా రాజధానిగా పేరుగాంచిన మెల్‌బోర్న్‌లో, రెండు దేశాలను కలిపే 'దౌత్య భాష' క్రికెట్ అని మోదీ అన్నారు. "మా సమావేశాలు ఒక క్రికెట్ మ్యాచ్ లాంటివి. మా ఎజెండా వన్డే ఇంటర్నేషనల్ అంత స్పష్టంగా ఉంటుంది. మా నిర్ణయాలు టీ20 మ్యాచ్ అంత వేగంగా ఉంటాయి. మా భాగస్వామ్యం టెస్ట్ మ్యాచ్ అంత శాశ్వతమైనది, లోతైనది" అని ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ సదస్సులో ఒక చారిత్రాత్మక అణు సహకార ఒప్పందం కుదరడం అత్యంత కీలక పరిణామం. ఇది ఇరు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త కోణాన్ని ఇచ్చింది. దీంతో పాటు ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ తీవ్రంగా ఖండిస్తూ ఇరు దేశాధినేతలు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్, సిడ్నీలోని బాండీ బీచ్‌లో ఇటీవల జరిగిన దాడులను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉగ్రవాద నిర్మూలనకు సమాచార మార్పిడి, ఆన్‌లైన్ తీవ్రవాదంపై పోరాటం, ఐక్యరాజ్యసమితి నిషేధిత ఉగ్రవాద సంస్థలు, వాటి నెట్‌వర్క్‌లపై చర్యలు తీసుకోవడంలో సహకరించుకోవాలని ఇరు దేశాలు ప్రతిజ్ఞ చేశాయి. ఈ చర్చల్లో యురేనియం సరఫరా, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, కీలకమైన ఖనిజాలు, విద్య, క్రీడా మౌలిక సదుపాయాలు, ప్రజల మధ్య సంబంధాలు వంటి అనేక ఇతర అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. భవిష్యత్తులో ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్ వంటి పెద్ద క్రీడా ఈవెంట్లను ఇరు దేశాలు నిర్వహించనున్న నేపథ్యంలో క్రీడా రంగంలో సహకారంపై కూడా దృష్టి సారించారు. ప్రాంతీయ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు 'ఎన్నడూ లేనంత కీలకమైనవి' అని ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ అభివర్ణించారు. మోదీ-అల్బనీస్ నాయకత్వంలో ఆర్థిక వృద్ధి, సాంకేతికత, వ్యూహాత్మక సవాళ్లపై ఇరు దేశాల మధ్య పెరుగుతున్న సమన్వయాన్ని ఈ పర్యటన ప్రతిబింబిస్తోంది. పర్యటనలో భాగంగా మార్వెల్ స్టేడియంలో ప్రవాస భారతీయులతో మోదీ సమావేశం కానుండటం గమనార్హం.

## హరీశ్ రావు అంత నిష్ణాతుడైతే.. కేసీఆర్ ఎందుకు తీసేశారు? -: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్!

హైదరాబాద్: సాగునీటి రంగంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చేసిన విమర్శలపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటుగా స్పందించారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... హరీశ్ రావుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇరిగేషన్‌లో హరీశ్ రావు ఏదో పెద్ద నిష్ణాతుడైనట్లు మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్ ఎద్దేవా చేశారు. "హరీశ్ రావుకు అంత సత్తా ఉంటే, గత ప్రభుత్వంలో ఆయన మామ కేసీఆర్ ఆయనను ఆ శాఖ నుంచి ఎందుకు తొలగించారు? హరీశ్ రావు పనితీరుపై నమ్మకం లేకనే కేసీఆర్ ఆయనను రాత్రికి రాత్రే నీటి పారుదల శాఖ నుంచి తీసేశారు" అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా హరీశ్ రావు ప్రెజెంటేషన్లు ఇస్తున్నారని, ఆయన చూపించిన అబద్ధపు గణాంకాలకు తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. హరీశ్ రావు చేసిన ప్రతి విమర్శకు సరైన సమయంలో, ఆధారాలతో సహా పూర్తి సమాధానం చెబుతామని మంత్రి స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ. 1,400 కోట్లపై విచారణ జరిపించాలి: కవిత

హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 1,400 కోట్ల నిధులు స్వచ్ఛమైనవి కావని అన్నారు. అవన్నీ క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవేనని ఆరోపించారు. ఆ నిధులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, ఆ డబ్బును తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు పంచాలి అని డిమాండ్ చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా చేపట్టిన 'సింగరేణి బాయి బాట' కార్యక్రమంలో భాగంగా తాను క్షేత్రస్థాయిలో కార్మికులతో మమేకమవుతున్నట్లు కవిత తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలు, చెల్లించాల్సిన బకాయిల కారణంగా సింగరేణి సంస్థపై పెను భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంస్థ ఎంతటి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందంటే... కనీసం కార్మికులకు అవసరమైన పనిముట్లు (మైనింగ్ పరికరాలు) కూడా కొనలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. "ఇక్కడ అధికారులకు ఓ రూల్... రాత్రింబవళ్లు కష్టపడే కార్మికులకు మరో రూల్‌లా యాజమాన్యం వ్యవహరిస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ వైఖరి వల్ల తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్‌పరం అవుతున్నాయని కవిత విమర్శించారు. తెలంగాణ రాకముందు సింగరేణిలో 62 వేల మంది రెగ్యులర్ కార్మికులు ఉండగా, నేడు ఆ సంఖ్య 38 వేలకు పడిపోయిందని గుర్తుచేశారు. కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. "కార్మికుల వారసత్వ (డిపెండెంట్) ఉద్యోగాల కోసం నెలలో కనీసం రెండు సార్లు మెడికల్ బోర్డ్ నిర్వహించాలి. ఒకవేళ ప్రభుత్వం, యాజమాన్యం డిపెండెంట్ ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వకపోతే.. ఈనెల 20 నుంచి రామగుండం వేదికగా నిరవధిక దీక్ష చేపడతాం" అని స్పష్టం చేశారు.

## మెల్‌బోర్న్‌లో మోదీకి ఘన స్వాగతం.. మార్వెల్ స్టేడియం 'హౌస్‌ఫుల్'

మొదటి పేజి తరువాయి

ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. తనకు లభించిన ఆత్మీయ ఆతిథ్యం పట్ల ఆస్ట్రేలియా ప్రజలు, ప్రధాని అల్బనీస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సిడ్నీలో గతంలో రెండుసార్లు ప్రవాస భారతీయులను కలిసిన విషయాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు మోదీ. అహ్మదాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం ఉంటే, మెల్‌బోర్న్‌లో ఐకానిక్ స్టేడియం ఉందని పేర్కొన్నారు. అయితే.. మార్వెల్ స్టేడియంలో అభిమానుల సందడి నెలకొనడంతో 'ఈ షో హౌస్‌ఫుల్.. బ్లాక్‌బస్టర్' అని మోదీ వ్యాఖ్యానించగా.. అక్కడివారు ఒక్కసారిగా హర్షధ్వానాలతో హోరెత్తించారు. 'భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు మునుపెన్నడూ లేనంత బలంగా ఉన్నాయి. ఈ బంధాన్ని మరింత దృఢంగా తీర్చిదిద్దడంలో ఎన్ఆర్ఐల పాత్ర కీలకం. మెల్‌బోర్న్‌లోని అనేక ప్రాంతాలు ఇప్పుడు 'మినీ ఇండియా'గా గుర్తింపు పొందుతూ, భారతీయ సంస్కృతితో అలలారుతోంది. భారత్ అభివృద్ధిలో మీరంతా భాగస్వామ్యం కావాలి.. 'గ్రో మోర్.. అచీవ్ మోర్' నినాదంతో ముందుకెళ్లాలి' అని మోదీ పిలుపునిచ్చారు. '5జీ రంగంలో భారత్ వేగంగా దూసుకెళ్తోంది. త్వరలో 6జీ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొస్తాం. మేడ్ ఇన్ ఇండియాలో భాగంగా 6జీ దిశగా పయనిస్తున్నాం. ఓ లక్ష్యం పూర్తైతే.. మరో సంకల్పంతో ముందుకు సాగాలి. రానున్న కాలంలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవబోతోంది. చంద్రయాన్ ద్వారా చంద్రుడి దక్షిణ ధృవంపై అడుగుపెట్టాం. స్పేస్‌లోకి గగన్‌యాన్‌ను పంపేందుకూ సిద్ధమవుతున్నాం. భారత్‌లో త్వరలో స్పేస్ స్టేషన్‌ను నిర్మించబోతున్నాం. భారత్ శక్తి, సామర్థ్యాలకు 'ఆపరేషన్ సిందూర్' ఓ ఉదాహరణ' అని మోదీ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీని విజనరీ నాయకుడిగా అభివర్ణించారు. ప్రపంచ దేశాలకు ఆయన స్ఫూర్తిగా నిలుస్తున్నారన్న అల్బనీస్.. మోదీ తమకు ఆప్తమిత్రుడని కొనియాడారు. ఆయన నాయకత్వంలో భారత్ ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ప్రశంసించారు.

## రాజకీయాలకు అతీతమైన బంధం.. తెలంగాణ మంత్రికి చంద్రబాబు, లోకేశ్ బర్త్‌డే విషెస్

హైదరాబాద్: రాజకీయాల్లో కొన్ని బంధాలు పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా నిలుస్తాయి. అలాంటి గౌరవప్రదమైన అనుబంధం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ మంత్రి సీతక్కల మధ్య కొనసాగుతోంది. తెలుగుదేశం పార్టీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సీతక్క (ధనసరి అనసూయ) పుట్టినరోజు సందర్భంగా చంద్రబాబు, ఆయన కుమారుడు, ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సీతక్క పుట్టినరోజు సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా స్పందించారు. "తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) గారికి జన్మదిన శుభాకాంక్షలు. ప్రజాసేవలో మీరు మరిన్ని విజయాలు సాధిస్తూ, ఆయురారోగ్యాలతో ఉండాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను" అని తన సందేశంలో పేర్కొన్నారు. మరోవైపు ఏపీ మంత్రి నారా లోకేశ్ కూడా సీతక్కకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమెను అణగారిన వర్గాల గొంతుకగా అభివర్ణిస్తూ, ఆమె జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. "తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖల మంత్రి శ్రీమతి ధనసరి సీతక్క గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ప్రజాసంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేస్తున్న సీతక్క గారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని లోకేశ్ ట్వీట్ చేశారు. తెలుగుదేశం పార్టీయే తనకు రాజకీయ జన్మనిచ్చిందని, చంద్రబాబే తన రాజకీయ గురువు అని సీతక్క పలు సందర్భాల్లో బహిరంగంగానే చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటికీ, చంద్రబాబుతో తనకున్న గౌరవ సంబంధాలు ఎప్పటికీ కొనసాగుతాయని ఆమె స్పష్టం చేశారు. ఏటా రాఖీ పౌర్ణమికి చంద్రబాబును కలిసి రాఖీ కట్టడం ద్వారా ఆమె తన అభిమానాన్ని చాటుకుంటారు. ఈ బంధంపై ఎవరు ఏమనుకున్నా తాను పట్టించుకోనని గతంలో ఆమె వ్యాఖ్యానించారు. పార్టీలు వేరైనా, రాష్ట్రాలు భిన్నమైనా వారి మధ్య ఉన్న ఈ గురుశిష్య అనుబంధం తెలుగు రాజకీయాల్లో ఒక ప్రత్యేకతగా నిలుస్తోంది.

# ఫడ్నవీస్‌ను కాదని షిండేతో భేటీ దేనికి?

మొదటి పేజి తరువాయి

మహారాష్ట్ర-కర్ణాటక సరిహద్దు వివాదంపై ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు శరద్ పవార్ బుధవారం అసెంబ్లీకి వచ్చారు. సమావేశం ముగిసిన అనంతరం ఆయన నేరుగా ఏక్‌నాథ్ షిండే ఛాంబర్‌కు వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయన వెంట ఎన్సీపీ (ఎస్పీ) నేతలు జయంత్ పాటిల్, జితేంద్ర అవ్హాద్, శశికాంత్ షిండే కూడా ఉన్నారు. ఆ సమయంలో షిండే క్యాబినెట్ సమావేశంలో ఉన్నారు. పవార్ వచ్చిన విషయం తెలుసుకున్న షిండే సమావేశం నుంచి బయటకు వచ్చి ఆయనను కలిశారు. ఇద్దరు నేతలు దాదాపు 15 నిమిషాల పాటు చర్చలు జరిపారు. అనంతరం షిండే తిరిగి క్యాబినెట్ సమావేశానికి వెళ్లగా.. పవార్ కొంతసేపు తన పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు.



### అసలు చర్చంతా ఫడ్నవీస్ చుట్టూనే..

ఈ భేటీలో ఆసక్తిని పెంచిన అంశం ఒక్కటే కాదు. మహారాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కీలక నిర్ణయాధికారిగా ఉన్నప్పటికీ.. పవార్ ఆయనను కాకుండా షిండేను కలవడం రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షించింది. అయితే దీన్ని కేవలం ఫడ్నవీస్‌ను పక్కన పెట్టిన చర్యగా చూడలేమని విశ్లేషకులు చెబుతున్నారు. మహారాష్ట్ర రాజకీయాల్లో షిండేకు ఉన్న ప్రత్యేక రాజకీయ స్థానం ఈ భేటీకి కారణంగా కనిపిస్తోంది. శివసేనలో చీలిక తర్వాత షిండే వర్గం మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక శక్తిగా మారింది. ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేన నుంచి పలువురు నేతలు షిండే శిబిరంలోకి వెళ్లడం, ఇటీవల ఆ వర్గంలో చోటుచేసుకున్న పరిణామాలు.. షిండేను ఒక ప్రత్యేక రాజకీయ కేంద్రంగా నిలిపాయి.

### షిండే ఎందుకు కీలకం?

శరద్ పవార్‌కు మహారాష్ట్ర రాజకీయాల్లో దశాబ్దాల అనుభవం ఉంది. ప్రత్యర్థి పార్టీల నేతలతోనూ రాజకీయ సంబంధాలు కొనసాగించడం ఆయన శైలిలో భాగం. ఈ నేపథ్యంలో షిండేతో భేటీని కూడా అదే రాజకీయ సంప్రదింపుల కోణంలో చూడాల్సి ఉంటుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే మరోవైపు.. శివసేనలోని పరిణామాలు, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)లో నెలకొన్న అంతర్గత సమస్యల నేపథ్యంలో ఈ సమావేశం కొత్త ఊహాగానాలకు కారణమైంది.

### ఎంవీఏలో పెరుగుతున్న ఒత్తిళ్లు

కాంగ్రెస్, ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం), శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం) కలిసి ఉన్న మహా వికాస్ అఘాడీకి ఇటీవలి కాలంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు షిండే వర్గంలోకి వెళ్లడం ప్రతిపక్ష కూటమిలో కలకలం రేపింది. భవిష్యత్ రాజకీయ పోరాటాలకు ముందు కూటమి ఐక్యతపై ప్రశ్నలు తలెత్తుతున్న సమయంలో పవార్--షిండే భేటీ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

### రాజకీయ సంకేతమా? లేక..

అయితే ఈ సమావేశంలో రాజకీయ సమీకరణాలపై చర్చ జరిగిందని ఎలాంటి అధికారిక సమాచారం లేదు. షిండే కార్యాలయం దీనిని మర్యాదపూర్వక సమావేశంగానే పేర్కొంది. పవార్ కూడా భేటీ వివరాలను వెల్లడించలేదు. కానీ మహారాష్ట్ర రాజకీయాల్లో నేతల మధ్య జరిగే ప్రతి భేటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. ముఖ్యంగా శరద్ పవార్ వంటి సీనియర్ రాజకీయ నాయకుడు.. అధికార కూటమిలో కీలకంగా ఉన్న షిండేను ప్రత్యేకంగా కలవడం సహజంగానే చర్చకు దారితీసింది.

# సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభం

మొదటి పేజి తరువాయి

"ఆ నగరాల అనుభవాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలోని జీడిమెట్ల, బాలానగర్ లాంటి ఇండస్ట్రియల్ పార్కులున్న ప్రాంతాల్లో పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం, దానికితోడు మూసీ నది కాలుష్యంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే 2,100 చ.కి.మీ మేరకు విస్తరించి ఉన్న ఈ కోర్ అర్బన్ రీజియన్ లో పూర్తిగా కాలుష్యరహిత ప్రాంతంగా మార్చాలని సంకల్పించాం. పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించడానికి చట్టం చేశాం. ఓఆర్ఆర్ బయట పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ ప్రాంతంలో మాన్యుఫాక్చరింగ్ జోన్ గా గుర్తించాం. ఇక్కడి నుంచి తరలించిన పరిశ్రమలకు అవసరమైన స్థలాలను మాన్యుఫాక్చరింగ్ జోన్ లో కేటాయిస్తాం.." అని ముఖ్యమంత్రి గారు వివరించారు. "మాన్యుఫాక్చరింగ్ జోన్‌లో మొట్టమొదటగా ప్రారంభమైన సంస్థ ప్రీమియర్ ఎనర్జీ కావడం ప్రశంసనీయం. కేవలం 12 నెలల కాలంలో యూనిట్‌ను నెలకొల్పింది" అని ముఖ్యమంత్రి సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. "తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు ప్రాంతీయ మండళ్లుగా విభజించి



సమగ్రమైన ప్రణాళికలతో ముందుకు వెళుతున్నాం. 2034 నాటికి 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ది, తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టాలన్నది మా సంకల్పం. వైట్ కాలర్ ఉద్యోగాలు కష్టమైన పరిస్థితులను అర్థం చేసుకుని యువత బ్లూకాలర్ జాబ్స్ అందిపుచ్చుకునే దిశగా నైపుణ్యతను పెంచడానికి ఎక్కువ దృష్టి సారించాం. ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి మొత్తంగా వ్యవస్థలను ఆ దిశగా సిద్ధం చేస్తున్నాం" అని చెప్పారు. "హైదరాబాద్ ప్రపంచంతో పోటీ పడాలంటే ఇప్పుడున్న పెట్టుబడులు, పరిశ్రమలు సరిపోవు. మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు రావాలి. 2047 నాటికి వంద సంవత్సరాల స్వాతంత్ర్య ఉత్సవాలను జరుపుకోబోతున్న తరుణంలో వెనక్కి తిరిగి చూస్తే ఎక్కడ మొదలయ్యాం. ఎక్కడికి చేరుకోవాలనుకున్నామో ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లాలి. పెరిగిన కాలుష్యాన్ని నియంత్రించడానికి సోలార్ ఎనర్జీతో ఆక్సిజన్ పంపింగ్ చేసే యంత్రాలను ప్రీమియర్ ఎనర్జీ రూపొందించడం అభినందనీయం. అలాంటి పరిస్థితులు తలెత్తడంపై అందరూ ఆలోచన చేయాలి. ప్రకృతిని విధ్వంసం చేయడం వల్ల ఇలాంటి తీవ్రమైన పరిణామాలకు దారితీస్తోంది. నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అంతకన్నా ఎక్కువ ప్రజల నుంచి సంపూర్ణ సహకారం ఉండాలి" అని ముఖ్యమంత్రి గారు కోరారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి గారు, కాలె యాదయ్య గారు, ప్రీమియర్ ఎనర్జీ చైర్మన్ సురేందర్ పాల్ సింగ్ సలూజా గారు, మేనేజింగ్ డైరెక్టర్ చిరంజీవ్ సింగ్ సలూజా గారు, డైరెక్టర్ సుధీర్ మూల గారు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రేవతి రోహిణి గారు, ప్రభుత్వ అధికారులు, సంస్థ ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# కియా ఈవీ హబ్, విశాఖలో ఎక్స్‌పోర్ట్ సెంటర్.. కొరియాలో మంత్రి లోకేశ్ కీలక భేటీలు

మొదటి పేజి తరువాయి

అంతర్జాతీయ మార్కెట్లకు సులభంగా ఎగుమతులు చేసేందుకు వీలుగా విశాఖపట్నం పోర్టు సమీపంలో ఒక సీకేడీ (కంప్లీట్లీ నాక్డ్ డౌన్) అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. దీనితో పాటు, ఈ-జీఎంపీ ప్లాట్‌ఫామ్ కాంపోనెంట్లు, బ్యాటరీ సిస్టమ్‌లు, ఈవీ ఛార్జింగ్ ఎలక్ట్రానిక్స్ కోసం ఒక ఈవీ-కాంపోనెంట్ల తయారీ కేంద్రాన్ని, పవర్‌ట్రెయిన్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్ కోసం ఒక ఈవీ పవర్‌ట్రెయిన్ టెస్టింగ్ కేంద్రాన్ని కూడా స్థాపించాలని కోరారు. మంత్రి లోకేశ్ ప్రతిపాదనలపై కియా ప్రతినిధి టే హన్ లీ సానుకూలంగా స్పందించారు. 2017లో అనంతపురంలో అడుగుపెట్టి, 2019 నాటికి భారీ ఉత్పత్తి ప్రారంభించిన తీరును గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం తమ సంస్థ ఈవీ, అటానమస్ మొబిలిటీపై దృష్టి సారించిందని, లోకేశ్ చేసిన తాజా ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### కొరియన్ పెట్టుబడిదారులకు 3ఎ భరోసా

అనంతరం మంత్రి లోకేశ్, దక్షిణ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్-హే సిసిలియా



చుంగ్‌తో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న 3ఎ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో, తూర్పు తీరంలో సురక్షితమైన, నమ్మకమైన ప్రత్యామ్నాయంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని, దీనివల్ల అంతర్జాతీయ సరఫరా శృంఖల (సప్లయ్ చైన్) నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పన్ను రాయితీలు, తక్కువ ధరకే భూమి, సబ్సిడీలు పరిశ్రమలకు అండగా నిలుస్తాయని తెలిపారు.

### నైపుణ్యాభివృద్ధి, సాంస్కృతిక బంధానికి పెద్దపీట

కొరియన్ సంస్థలు ఏపీకి రావడానికి ముందే, అక్కడి పని ప్రమాణాలు, భాష, సంస్కృతిపై స్థానిక యువతకు అవగాహన కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని లోకేశ్ తెలిపారు. దీనికోసం దక్షిణ కొరియాతో కలిసి సంయుక్త శిక్షణా అకాడమీలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర విద్యా, నైపుణ్యాభివృద్ధి శాఖలు సంసిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక బంధాన్ని బలోపేతం చేసేందుకు ఏపీలో ఒక కొరియన్ కల్చరల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. భారత్‌లోనే రెండో అతి పొడవైన తీరప్రాంతం, విశాఖపట్నం, కృష్ణపట్నం వంటి ప్రధాన ఓడరేవులు, కొత్తగా రాబోయే నాలుగు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల వల్ల ఏపీ తక్కువ ఖర్చుతో ఎగుమతులకు లాంచ్‌ప్యాడ్‌గా మారుతుందని లోకేశ్ వివరించారు. భారత్-కొరియా వ్యూహాత్మక భాగస్వామ్యానికి అనుబంధంగా ఒక ప్రత్యేకమైన 'ఆంధ్రప్రదేశ్-కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్' ఏర్పాటు చేయాలని, ఇరు ప్రాంతాల మధ్య వార్షిక ఆర్థిక భాగస్వామ్య చర్చలకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. వాణిజ్య సంబంధాలను మరింత పటిష్ఠం చేయడానికి విశాఖపట్నం-బుసాన్/ఇంచియాన్ నగరాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడం, ఏపీలోని యూనివర్సిటీల్లో కొరియన్ భాషా కేంద్రాలు, డైరెక్ట్ ఎయిర్ కనెక్టివిటీకి చొరవ చూపాలని కోరారు.

## గుటుపల్లె భూముల వివాదం.. స్వయంగా తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లిన సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

అమరావతి: నంద్యాల జిల్లాలోని బేతంచెర్ల రైతులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సమస్యకు ముఖ్యమంత్రి చంద్రబాబు శాశ్వత పరిష్కారం చూపారు. గత ప్రభుత్వం 22ఏ నిషేధిత జాబితాలో పెట్టిన వేలాది ఎకరాల భూములకు విముక్తి కల్పించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు స్వయంగా బనగానపల్లె తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లిన సీఎం, తన సమక్షంలోనే అధికారిక ప్రక్రియను పూర్తి చేయించారు. బేతంచెర్ల మండలం గుటుపల్లె గ్రామంలోని సర్వే నెం. 215లో ఉన్న 2,669 ఎకరాల సర్వీసు ఇనాం భూములను గత ప్రభుత్వం 1908 నాటి చట్టాన్ని కారణంగా చూపి 22ఏ జాబితాలో చేర్చింది. దీంతో రైతులు తమ భూములపై హక్కులు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది మార్చిలో తమ గోడును ముఖ్యమంత్రికి విన్నవించుకున్నారు. వారి వినతిపై స్పందించిన ప్రభుత్వం, 2,074 ఎకరాల పట్టాభూమిని 22ఏ(1)(సి) జాబితా నుంచి తొలగించాలని నిర్ణయించింది. గురువారం బనగానపల్లె తహసిల్దార్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమక్షంలో జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్‌లు ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్ ద్వారా ఈ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ఈ ప్రక్రియను అధికారులు సీఎంకు వివరించారు. ఇదే సమయంలో, 2023లో జాబితాలో చేర్చిన 426 ఎకరాల వక్ఫ్ భూములను కూడా తొలగించడంతో 897 మంది రైతులకు లబ్ధి చేకూరింది. వీటితో పాటు బనగానపల్లె నియోజకవర్గంలో 23 మంది రైతులకు చెందిన 101 ఎకరాల చుక్కల భూములను కూడా క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అనంతరం సీఎం చంద్రబాబు స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో లబ్ధిదారులైన రైతులతో మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు వారి భూములను తిరిగి అప్పగించామని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రికి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కడియం శ్రీహరిది కపట బుద్ధి.. నా శాఖను హైజాక్ చేశారు

మొదటి పేజి తరువాయి

టీవీ9తో మాట్లాడుతూ.. తాను బాధ్యతలు చూస్తున్న దేవాదాయ శాఖలోకి తనకు సమాచారం ఇవ్వకుండా కడియం వచ్చి కమిషనర్‌తో సమీక్ష నిర్వహించారని సురేఖ ఆరోపించారు. ఏ పౌరుడైనా శాఖ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం ఇవ్వొచ్చని, కానీ సమీక్షలు నిర్వహించడం మాత్రం తన శాఖను హైజాక్ చేసినట్టేనని వ్యాఖ్యానించారు. మంత్రి, ఎమ్మెల్యే బాధ్యతల మధ్య తేడా తెలుసుకోవాలని కడియానికి సూచించారు. ఈ సందర్భంగా కడియంపై సురేఖ వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. తాను సీనియర్‌నని, ఎన్నోసార్లు మంత్రిగా పనిచేశానని చెప్పుకుంటారని ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసి తర్వాత కాంగ్రెస్‌లో చేరిన వ్యక్తి ఇప్పుడు నీతి గురించి మాట్లాడటం సరికాదని విమర్శించారు. తాను కేవలం వినతిపత్రం మాత్రమే ఇచ్చానని, అపార్థం జరిగిందని కడియం చెప్పిన వివరణను కూడా సురేఖ ఖండించారు. సమీక్ష నిర్వహించి అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు కడియమే ప్రెస్‌నోట్ విడుదల చేశారని చెప్పారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు కూడా వివరించినట్లు వెల్లడించారు. కడియం కపట బుద్ధితో వ్యవహరిస్తున్నారని సురేఖ ఆరోపించారు. ఎదుటివారి ఎదుగుదలను ఆయన సహించరని విమర్శించారు. గతంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యేగా ఉండటం జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరిన తర్వాతే గ్రూపు రాజకీయాలు పెరిగాయని ఆరోపించారు. మరోవైపు కడియం-సురేఖ వివాదాన్ని పరిష్కరిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. దీనిపై త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

## ఏపీలో కారుణ్య మరణంపై స్పష్టత.. అమల్లోకి కొత్త నిబంధనలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో నిష్క్రియాత్మక కారుణ్య మరణం (ప్యాసివ్ యూథనేషియా) అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. కోలుకునే అవకాశం లేని వ్యాధులతో బాధపడుతున్న రోగులకు జీవనాధార వ్యవస్థలను ఉపసంహరించుకోవడానికి వీలు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ జులై 8న ఈ విధివిధానాలకు అధికారికంగా ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన 'గౌరవప్రదంగా మరణించే హక్కు'కు అనుగుణంగా ఈ నిబంధనలను రూపొందించారు. ప్యాసివ్ యూథనేషియా అంటే కోలుకోలేని స్థితిలో ఉన్న రోగులకు వెంటిలేటర్లు, ఫీడింగ్ ట్యూబ్‌లు వంటి కృత్రిమ వైద్య సహాయాన్ని నిలిపివేసి, వారు సహజంగా మరణించేందుకు అనుమతించడం. ఇది భారతదేశంలో నిషేధించబడిన 'యాక్టివ్ యూథనేషియా'కు భిన్నమైనది. సుప్రీంకోర్టు 2018లో 'కామన్ కాజ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో చారిత్రాత్మక తీర్పునిస్తూ ప్యాసివ్ యూథనేషియాకు అనుమతించినప్పటికీ, రాష్ట్ర స్థాయిలో స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో ఇప్పటివరకు అనిశ్చితి నెలకొంది.

### మార్గదర్శకాలలోని ముఖ్యాంశాలు

ఈ కొత్త నిబంధనల ప్రకారం, స్పృహలో ఉన్న ఏ వ్యక్తి అయినా 'అడ్వాన్స్ డైరెక్టివ్' (ముందస్తు వీలునామా) రాసుకోవచ్చు. దీని ద్వారా భవిష్యత్తులో తనకు ఎలాంటి చికిత్స అందించాలో లేదా నిలిపివేయాలో ముందుగానే నిర్ణయించుకునే అవకాశం ఉంటుంది. ఇద్దరు సాక్షుల సమక్షంలో నోటరీ లేదా గెజిటెడ్ అధికారి ద్వారా ఈ పత్రాన్ని ధృవీకరించుకోవాలి. కవేళ రోగి పరిస్థితి విషమించి, చికిత్స ఫలించదని భావిస్తే సంబంధిత ఆసుపత్రి ఒక 'ప్రైమరీ మెడికల్ బోర్డు'ను ఏర్పాటు చేయాలి. ఈ బోర్డు 48 గంటల్లోగా తన నివేదికను సమర్పిస్తుంది. వారి సిఫార్సుల అనంతరం, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ) నేతృత్వంలోని 'సెకండరీ మెడికల్ బోర్డు' తుది నిర్ణయం తీసుకుంటుంది. కుటుంబ సభ్యుల అంగీకారం, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌కు సమాచారం అందించిన తర్వాతే వైద్య సహాయాన్ని నిలిపివేస్తారు. ఈ నిబంధనల అమలును డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ సహా ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు. తాజా మార్గదర్శకాల వల్ల రోగుల కుటుంబాలపై మానసిక, ఆర్థిక భారం తగ్గడంతో పాటు, వైద్యులకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## తీరుమలాయపాలెం మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో జరుగుతున్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రతిష్టా వేడుకలకు




(లోకల్ గైడ్. తిరుమల పాలెం ) తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారి సతీమణి శ్రీమతి పొంగులేటి మాధురి గారు పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో దయాకర్ రెడ్డి గారు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల అశోక్ గారు తదితరులు పాల్గొన్నారు

## బిఆర్ఎస్ పార్టీ అధినేత శ్రీ కేసీఆర్. ఆదేశాలతో పార్టీ పార్లమెంటరీ నేతగా



(. లోకల్ గైడ్. ఖమ్మం). నియమితులైన రాజ్యసభ సభ్యులు, ఖమ్మం జిల్లా గర్వకారణం శ్రీ వద్దిరాజు రవిచంద్ర ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ, రాష్ట్ర కార్యదర్శి శ్రీ తాతా మధుసూదన్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ నాయకుడు షేక్ సద్దాం శాలువాతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల ఆకాంక్షలు, రాష్ట్ర హక్కుల



పరిరక్షణ కోసం పార్లమెంట్ వేదికగా మరింత సమర్థవంతంగా పోరాడుతూ, పార్టీ అధినేత శ్రీ కేసీఆర్ ఆశయాలను దేశవ్యాప్తంగా బలంగా వినిపించాలని ఆకాంక్షించారు. వారి నాయకత్వంలో బిఆర్ఎస్ పార్టీ స్వరం పార్లమెంట్‌లో మరింత బలోపేతం కావాలని కోరుతూ షేక్ సద్దాం శుభాకాంక్షలు తెలిపారు.

## ఎబివిపి కడ్తాల్ శాఖ ఆధ్వర్యంలో 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



కడ్తాల్, జులై 9 (లోకల్ గైడ్): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కడ్తాల్ శాఖ ఆధ్వర్యంలో 78వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎబివిపి రాష్ట్ర నాయకులు క్యామ శ్రీకాంత్, నగర కార్యదర్శి నేనావత్ పవన్ ఎబివిపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1949 జూలై 9న ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన ఎబివిపి నేడు దేశవ్యాప్తంగా విస్తరించి, విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఎదిగిందన్నారు. కడ్తాల్ మండలంలో కస్తూరిబా గాంధీ పాఠశాలకు సొంత భవనం కోసం పోరాటం చేసి విజయం సాధించామని తెలిపారు. కడ్తాల్ - షాద్నగర్ మార్గంలో బస్సులు నడపకపోవడంపై ఉద్యమించి తిరిగి బస్సులను నడిపించామన్నారు. విద్యార్థుల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ సకాలంలో విడుదల చేయాలని నిరంతరం పోరాటం చేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి పూర్వ నాయకులు దొనాదుల మహేష్, భగీరథ్, రవీందర్ రెడ్డి, సిద్దిగారి కుమార్, ఎబివిపి నాయకులు మల్లేష్, శ్రీకాంత్, సందీప్, సాయి కుమార్, ప్రవీణ్, అరుణ్, రమేష్, శివ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీ నీ వెంటనే ప్రకటించాలి పి ఆర్ టి యు డిమాండ్



నారాయణపేట జూలై 9::ప్రభుత్వము వెంటనే టి ఆర్ సి ని ప్రకటించాలనీ పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు .గురువారం పిఆర్టియుటిఎస్ ఉట్కూర్ మండల శాఖ అధ్యక్షులు గోవర్ధన్ ప్రధాన కార్యదర్శి కే నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఉట్కూరు మండల కేంద్రంతోపాటు మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి 2026 2027 విద్యాసంస్థలకు సంబంధించిన సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి గారు ఉపాధ్యాయులు ఉద్దేశించి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వము ఆర్థిక ప్రయోజనాలు కలిగించకుండా ఎన్ని మాటలు చెప్పినా వారి కుటుంబ అవసరాలు తీరవు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పిఆర్సిని 51 శాతం ఫిట్మెంట్తో మిగిలిన పెండింగ్ డీఏలను పిఆర్సి తో పాటు ప్రకటించాలని డిమాండ్ చేశారు అదేవిధంగా ఉపాధ్యాయులు ఆరోగ్య కారులపై సందేహాలను వ్యక్తం చేయగా ట్రస్టు ద్వారా నాణ్యమైన వైద్య సదుపాయము అందుతుందని కావున ఉపాధ్యాయులు ఎవరు హెల్త్ కార్డులపై అపోహలు చెందవలసిన అవసరం లేదని వివరణ ఇచ్చారు తెలంగాణ ప్రభుత్వం వారి మేనిఫెస్టోలో కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమును రద్దు చేస్తామని చెప్పి కాలయాపన చేయడం తగదని అన్నారు ప్రభుత్వము వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమ బాట పట్టడానికి సంసిద్ధంగా ఉండాలని ఉపాధ్యాయులను కోరారు ఏది ఏమైనప్పటికీ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పిఆర్టి తోనే సాధ్యమని ఉపాధ్యాయులకు తెలుసు అని అన్నారు అందువలన ఉపాధ్యాయులు సంఘ భలోపేతం కోసము సంఘంలో స్వచ్ఛందంగా సభ్యత్వము చేయాలని కోరగా ఉపాధ్యాయులు అధిక మొత్తంలో సంఘంలో సభ్యత్వం స్వీకరించారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారిని మాధవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర ప్రధాన ఉపాధ్యాయురాలు కుసుమ గారు మండల గౌరవ అధ్యక్షులు ఫజల్ జిల్లా బాధ్యులు భాస్కర్ ఆనంద్ సాయప్ప మహేష్ రాములు అబ్దుల్ సలాం ఆంజనేయులు గుర్నాథ్ పద్మావతి ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

## ఎస్ ఐ ఆర్ ను పర్యవేక్షిం చిన బిజెపి నాయకులు



నారాయణపేట జూలై 9:నారాయణపేట వార్డుల్లో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పట్టణంలోని 19వ వార్డులో గురువార పట్టణ అధ్యక్షులు పోషల్ వినోద్ పర్యవేక్షించారు. సంబంధిత బిఎల్ఓ ల కు అన్ని బూత్ లలోని ఓటర్లు వారికి సహకరించి ఈనెల 24వ తేదీ వరకు తమకు ఇచ్చినటువంటి ఎన్యుమరేషన్ ఫామ్ లను పూరించి వారికి అప్పగించా లని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫామ్ లను ఓటర్లు తమ తమ ఇళ్లలో ఉంచుకోకుండా ఏవైనా సందేహాలు ఉంటే ఫామ్ పై ఉన్న బిఎల్ఓ ల ఫోన్ నంబర్ల ద్వారా వారిని సంప్రదించి లేదా వార్డులో ఉన్న భారతీయ జనతా పార్టీ బి ఎల్ ఎ 2 లను గాని అక్కడి నాయకులను గాని సంప్రదించి అట్టి పత్రాలు వీలైనంత త్వరగా అందించా లని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బిజెపి పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శులు నక్క సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి సంబంధిత బి ఏ ల్ ఏ 2 లు శ్రీకాంత్, వల్లంపల్లి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## హాకా రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ముట్పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన హాకా రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే




(లోకల్ గైడ్ న్యూస్ కొందుర్గు)రైతాంగ సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు, సదుపాయాలు ఒకేచోట అందించాలనే ఉద్దేశంతో రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం కొందుర్గు మండలం ముట్పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన హాకా రైతు సేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, వ్యవసాయానికి అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సామగ్రి రైతులకు సకాలంలో అందుబాటులో ఉండేలా రైతు సేవా కేంద్రాలు పనిచేయాలని సూచించారు. రైతులు నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువుల బారిన పడకుండా నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను మాత్రమే వినియోగించాలని, రైతు సేవా కేంద్రాలు రైతులకు నమ్మకమైన సేవలు అందించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముట్పూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులందరూ ఈ హాకా రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు మెరుగైన దిగుబడులు సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. రైతు బాగుంటేనే గ్రామం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్న ఎమ్మెల్యే, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి,ఏఎంసీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, సయ్యాద్ సాదిక్ మల్లేష్ గౌడ్,రాములు గౌడ్ కేకే కృష్ణ, సర్పంచులు అంజి, ఫయం, జంగీర్,వీరేంర్ రెడ్డి జీబీ కృష్ణ,బోరేగ నరేందర్,బొట్టు శ్రీను,గుట్ట రాజు,నర్సింహా రెడ్డి,రవీందర్ రెడ్డి,గాలి శ్రీను,నాగులపల్లి శివకుమార్, మామిడిపల్లి రవి, ద్వేజేందర్, కోయల నర్సింలు, ఫిల్వన్,,కటిక రఘు జమల్పూర్ నరేందర్,శ్రీనాథ్ రెడ్డి,జగన్మోహన్ రెడ్డి, రమేష్ ,పామేనా కుమార్, శివకుమార్, వేమారెడ్డి, కాంట్రాక్టర్ సిద్ధార్థ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీనాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు..

## సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దొంతి రవిశంకర్ ముదిరాజ్



లోకల్ గైడ్ శేరిలింగంపల్లి:తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు శాఖీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి డి. అనసూయ సీతక్క జన్మదినాన్ని పురస్కరించుకొని ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు కాంగ్రెస్ నేత దొంతి రవిశంకర్ ముదిరాజ్.ఈ సందర్భంగా దొంతి రవిశంకర్ మాట్లాడుతూ -- “సీతక్క ప్రజలతో మమేకమై నిరంతరం వారి కోసం పోరాడుతున్న శక్తివంతమైన నాయకురాలు. ఆమె జీవిత పోరాటం ఎంతోమందికి ప్రేరణగా నిలుస్తోంది. తెలంగాణ గ్రామీణాభివృద్ధికి ఆమె చేపడుతున్న కార్యాచరణలు ప్రశంసనీయం” అని అన్నారు.సామాజిక న్యాయం కోసం, గిరిజన హక్కుల పరిరక్షణ కోసం మరియు పల్లె అభివృద్ధి కోసం ఆమె నిరంతరం కృషి చేస్తోందని, ఆమె నాయకత్వం తెలంగాణకు అగ్రగామిగా నిలుస్తుందని అన్నారు. జన్మదినం సందర్భంగా సీతక్క ఆరోగ్యంగా, దీర్ఘాయుష్షుతో మరింత ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు.పార్టీ శ్రేణులు, అభిమానులు, సామాజిక కార్యకర్తలతో కలిసి దొంతి రవిశంకర్ జన్మదిన శుభాకాంక్షలు తెలపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు ఆశీర్వాద సభకు చింతకాని వేదిక

9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ

తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టి పెట్టాలి

150 స్టాల్స్ ఏర్పాటు అంచనాలకు మించి 11 వేల మంది రైతుల హాజరు

మెగా రైతు మేళాలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




చింతకాని, జూలై-09:లోకల్ గైడ్ :రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.చింతకాని మండలం జగన్నాధపురం గ్రామంలో గురువారం నిర్వహించిన మెగా రైతు మేళాకు రైతులు విశేషంగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మంత్రివర్గం రైతుల అవసరాలు, వ్యవసాయ రంగ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందన్నారు. విత్తనం వేసినప్పటి నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి దశలో రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని, తమ ప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా చేతల్లో చూపించే ప్రభుత్వమని అన్నారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీరాం సాగర్, కడెం వంటి సాగునీటి ప్రాజెక్టులు నేటికీ రైతులకు నీరందిస్తున్నాయని, గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం కుంగిపోవడం ఆ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో ప్రతి కుటుంబానికి వ్యవసాయంతో అనుబంధం ఉందని, అందుకే ఇక్కడ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు.ప్రభుత్వానికి అనేక సమస్యలు ఉన్నప్పటికీ ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేశామని తెలిపారు. వ్యవసాయ ఆధునికీకరణ కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని, ఖమ్మం నుంచి ఆదిలాబాద్ వరకు ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును విస్తరిస్తున్నామని తెలిపారు.రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యామ్నాయ పంటలపై శాస్త్రవేత్తలతో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి సహా తెలంగాణ మంత్రివర్గం మొత్తం హాజరవుతుందని అన్నారు.ప్రస్తుతం రైతులకు అందుతున్న ప్రతి నీటి చుక్క కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారానే వస్తోందని తెలిపారు. రైతులను మాయమాటలతో మోసం చేసే పార్టీలకు ప్రజలు అవకాశం ఇవ్వబోరని అన్నారు.రైతు సంక్షేమానికి పునాదులు వేసిన ప్రభుత్వాలను రైతులే కాపాడుకుంటారని, ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్న అబద్ధాలను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. చింతకాని మండలంలో మూడు లక్షల మంది రైతులతో భారీ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను రైతులకు అందించాలనే లక్ష్యంతో స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. రైతుల అభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని, శాస్త్రవేత్తలు చెప్పే అంశాలను రైతులు శ్రద్ధగా విని గ్రామాలకు తీసుకెళ్లాలని కోరారు. ఆధునిక సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయంతో పాటు ఫిషరీస్, హార్టికల్చర్ తదితర అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు.వ్యవసాయ శాఖ మంత్రి




తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో జూన్ 30న నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభ వర్షాల కారణంగా జూలై 10వ తేదీకి వాయిదా పడిందన్నారు. తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు సభను చింతకాని మండలంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవడం లేదని, ఈ ఏడాది నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఎలా వ్యవసాయం చేయాలనే అంశాలపై వ్యవసాయ శాఖ శాస్త్రీయ సూచనలు అందిస్తోందన్నారు.వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైరా ప్రాజెక్టుకు గోదావరి జలాలు అందించాలని చేసిన విజ్ఞప్తికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని వినియోగించుకుంటూ రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను వైరా ప్రాజెక్టుకు తరలిస్తున్నామని, దీంతో వర్షాలతో సంబంధం లేకుండా దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు.తక్కువ కాలంలో, తక్కువ నీటితో పండే పంటలను రైతులు సాగు చేయాలని సూచించారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్నను కొనుగోలు చేయలేదని, రైతులు నష్టపోకుండా ఉండేందుకు డిప్యూటీ సీఎం రూ.5 వేల కోట్లు కేటాయించి మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేశారని తెలిపారు. మొక్కజొన్నతో పాటు జొన్న, సోయా తదితర పంటలను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. మొక్కజొన్న విక్రయించిన రైతుల ఖాతాల్లో మద్దతు ధర చెల్లింపులు రేపటిలోగా జమ చేస్తామని స్పష్టం చేశారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభ చారిత్రక ఘట్టమని, రైతులకు అవసరమైన ప్రతి సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు లక్షలాది మంది రైతులు హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఉద్యమాలు, పోరాటాలు, వ్యవసాయ రంగంలో ఖమ్మం జిల్లాకు ఘన చరిత్ర ఉందని, జిల్లాలో అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందన్నారు. సంప్రదాయ పంటలతోపాటు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు.సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ద్వారా వచ్చే వేతనం కంటే ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వం, ప్రకృతి సహకరించక పోయినా రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రైతులకు అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సమకూరుస్తున్నామని, యూరియా యాప్ ద్వారా అవసరమైన మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. యూరియా యాప్ వల్ల దుర్వినియోగానికి అవకాశం లేకుండా పోయిందన్నారు.రైతులకు వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని, మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రపంచంలో ఉన్న అత్యాధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మెగా రైతు మేళా, రైతు ఆశీర్వాద సభ నిర్వహణకు అద్భుతమైన ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం, అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు.వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతులకు వివరించేందుకు ఈ మెగా రైతు మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదర్శ రైతులు అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలను ఇతర రైతులకు పరిచయం చేయడం కూడా ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.పంట మార్పిడి విధానం అమలు చేయడం, ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మెగా రైతు మేళా కోసం మొత్తం 150 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖతో పాటు హార్టికల్చర్, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.మెగా రైతు మేళాకు 5 వేల మంది రైతులు వస్తారని అంచనా వేయగా దాదాపు 11 వేల మంది రైతులు హాజరయ్యారని తెలిపారు. రైతుల కోసం ఆధునిక వ్యవసాయ యంత్రాలు, సాంకేతిక పరికరాలను ప్రదర్శనకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు ఎలా సాధించాలి, ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగంలో ఎలా వినియోగించు కోవాలి అనే అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాకు విచ్చేయనున్నారని, 'రైతు ఆశీర్వాదం' పేరుతో మూడు లక్షల మంది రైతులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొంటూ, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్-నినో" ప్రభావంపై మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్



కామారెడ్డి జూలై 9 లోకల్ గైడ్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆధ్వర్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. "ఎల్-నినో" ప్రభావం కారణంగా వర్షపాతం తక్కువగా ఉండే



అవకాశం ఉన్న నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై దిశా నిర్దేశం చేశారు.వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ పంటల మార్పు: జిల్లాలో నీటి ఆవశ్యకత అధికంగా ఉన్న వరి పంట విస్తీర్ణాన్ని తగ్గించాలని సూచించారు. రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు.ఆరుతడి పంటలు: మొక్కజొన్న, సోయా, పెసర్లు, అలసందలు, మినుములు, కందులు, పత్తి మరియు కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలను ఎంచుకోవాలని సూచించారు.రిజర్వాయర్ల పరిస్థితి: ప్రధాన రిజర్వాయర్లైన నిజాంసాగర్, పోచారం, కౌలాస్ నాలాలో నీటి నిల్వ సామర్థ్యం నీటి ప్రవాహం తక్కువగా ఉన్నందున వరి సాగును తగ్గించాలని కోరారు.

### అవగాహన కార్యక్రమాలు:

రైతు వేదికల్లో వ్యవసాయ నీటిపారుదల శాఖ అధికారులు సంయుక్తంగా సమావేశాలు నిర్వహించి, రైతులకు ఆరుతడి పంటల ప్రాముఖ్యత, సాగు పద్ధతులు, ప్రభుత్వ సహాయాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి, మోహన్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఖమ్మం



(లోకల్ గైడ్. ఖమ్మం)56 లక్షల విలువ చేసే 113 కేజీల గంజాయి పట్టివేతనలుగురు నిందితులు అరెస్ట్...పరారీ మరో ఇద్దరు.ఇన్స్పెక్టర్ బాలకృష్ణ.విశ్వసనీయ సమాచారం మేరకు టౌన్ ఏసీపీ రమణమూర్తి ఆదేశాల మేరకు బుధవారం రాత్రి సమయంలో ఖమ్మం బైపాస్ రోడ్డులో తిరుమల రోలింగ్ షట్టర్ ఇంజనీరింగ్ వర్క్స్ వద్దఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, ఈగిల్ టీమ్ సిఐ విజయ్, టూ టౌన్ ా× వి. రమేష్, పోలీస్, ఈగిల్ టీమ్ సిబ్బంది సంయుక్తంగా నిఘా పెట్టి, అనుమానస్పదంగా వస్తున్న నిందితుల వాహనాలను అడ్డగించి, తనిఖీలు నిర్వహించి సుమారు 56 లక్షల విలువ చేసే 113 కేజీల గంజాయి అక్రమ రవాణాను పట్టుకున్నట్లు ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన నిందితులు ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లా నుండి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, వారు అద్దెకు తీసుకున్న రెండు వాహనాల డిక్కీ, డ్యాష్‌బోర్డులలో రహస్యంగా దాచి మహారాష్ట్రకు రవాణా చేస్తున్నారని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న పోలీస్ అధికారులను, సిబ్బందిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రత్యేకంగా అభినందించారు.పరారీలో ఉన్న మిగిలిన ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని పేర్కొన్నారు.

### అరెస్ట్ అయిన నిందితులు:

రవి జాదవ్ (28), గోపీనాథ్ సుక్లే (55), సంతోష్ థాయప్ప (40), మోహన్ భీకాజీ జాదవ్ (36) – – అందరూ ఉస్మానాబాద్ జిల్లా, మహారాష్ట్ర నివాసితులని వివరించారు. పరారీలో ఉన్న నిందితులు : బసు ఏ వాసు (గంజాయి సప్లయర్, అల్లూరి జిల్లా, ఆంధ్రాప్రదేశ్), భావూసాహెబ్ యాదవ్ క్షీరసాగర్ (అద్దె కారు యజమాని).

### రికవరీ చేసుకున్న సొత్తు:

113.025 కిలోల గంజాయి (53 బ్రౌన్ టేప్ ప్యాకెట్లు) -- సుమారు విలువ రూ. 56,50,000/-. 2 వాహనాలు: మారుతి ఎర్టిగా,టాటా ఆరియా. 4 మొబైల్ ఫోన్లు, రూ. 850/- నగదు.

## ఈవీఎం గోదాంను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జులై 9 లోకల్ గైడ్జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం పరిశీలించారు.ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేసి, నిరంతర పర్యవేక్షణ కొనసాగించేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా గోదాం పరిసర ప్రాంతాల భద్రత, రికార్డుల నిర్వహణ, సీలింగ్ ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించారు.

## పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మం...



లోకల్ గైడ్. ఖమ్మంరాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత...1500 మంది పోలీసులతో భారీ బందోబస్తు...పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలిభద్రతా విధులపై దిశానిర్దేశం చేసిన పోలీస్ కమిషనర్ .రేపు (శుక్రవారం) రాష్ట్ర ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లా, చింతకాని మండలం, జగన్నాధపురంలో ఏర్పాటు చేసిన రైతు ఆశీర్వాద సభకు విచ్చేయనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించి బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమైన పోలీస్ కమిషనర్ సునీల్ దత్ భద్రతా ఏర్పాట్లు, విధుల నిర్వహణ, సమన్వయంపై సమగ్ర దిశానిర్దేశం చేశారు.బందోబస్తు విధుల్లో పాల్గొనే



పోలీసు అధికారులకు, సిబ్బందికి సభ వేదిక సమీపంలో ప్రత్యేక బ్రీఫింగ్ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. సభా ప్రాంగణం మొదలు, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు ఇతర కీలక ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పోలీస్ అధికారులతో సమీక్షించారు.ముఖ్యమంత్రి పర్యటన భద్రతా ఏర్పాట్లలో భాగంగా సుమారు 1500 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని బందోబస్త్ విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేటాయించిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని, విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని సీపీ సూచించారు. పోలీసు అధికారులకు విధి నిర్వహణలో పాటించాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలతో మర్యాదపూర్వక వ్యవహారం, వీఐపీ భద్రత తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీ లు సారంగపాణి, తిరుపతి రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రైతుల కలను సాకారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ..

పాలక వర్గాన్ని సన్మానించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి .

ప్రమాణ స్వీకారం చేసిన నూతన వ్యవసాయ మార్కెట్ పాలక వర్గం..



వనపర్తి లోకల్ గైడ్ ప్రతినిధి జులై 9:రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 25 ఏళ్ల రైతుల కలను సహకారం చేసిందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుదవారం గోపాల్ పే ట మండలం బుద్ధారం గండి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఉమ్మడి గోపాల్ పేట రేవల్లి, ఏదుల మండలాల నూతన వ్యవసాయ మార్కెట్ యార్డుల పాలకవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దాదాపు 25 సంవత్సరాలుగా మార్కెట్ యార్డులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే రైతుల అవసరాన్ని గుర్తించి రెండు నూతన వ్యవసాయ మార్కెట్ యార్డులను ఏర్పాటు చేసి వారి కలను నిజం చేసిందన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల గురించి గొప్పలు చెప్పుకున్నప్పటికీ, వనపర్తి నియోజకవర్గంలో ఒక్క కొత్త మార్కెట్ యార్డును కూడా ఏర్పాటు చేయలేదని ఆయన విమర్శించారు. రైతుల కష్టాలు పట్టించుకోని



వారు ఇప్పుడు రైతుల గురించి మాట్లాడడం విడ్డూరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని చారిత్రాత్మక నిర్ణయాలు అమలు చేస్తోందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకం, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు . విద్యార్థులు, యువత, మహిళలు, వృద్ధులు, నిరుపేదల సంక్షేమానికి అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు . ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందన్నారు. అభివృద్ధి-- సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పని చేస్తున్నామని మ్మెల్యే స్పష్టం చేశారు.

### --- మార్కెట్ పాలక వర్గాన్ని సన్మానించిన ఎమ్మెల్యే .. .

నూతన మార్కెట్ యార్డు కమిటీల సభ్యులను జిల్లా అధికారిని పుష్పలత కమిటీలచే ప్రమాణ స్వీకారం చేయించారు . అనంతరం ఎమ్మెల్యే మార్కెట్ కమిటీఅధ్యక్షుడు వెంకటేష్ , ఉపాధ్యక్షుడి సత్యశిలా రెడ్డి , డైరెక్టర్లు బోటుక చంద్రయ్య, ఠాకూర్, సంతోష్, సురేందర్, సిరిమల్లేష్, తిరుపతయ్య, శ్రీనివాసులు, బాలపీరు జానమ్మ, వేమారెడ్డి దేవేందర్, తేజశ్రీ, రఘు, బంగారి తదితరులను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధికారులు, గోపాల్ పే ట ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, పెద్దలు, రైతులు, మహిళలు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు ..

## సర్ తో .. ఓటు హక్కును కాపాడుకోవాలి. చింతకుంట తండా సర్పంచి దేవి రాంచరణ్.

సర్ ఎన్యుమరేషన్ కార్యక్రమంలో ఫారం నింపి తండా ప్రజలకు అవగాహన కల్పించిన సర్పంచి దేవి రాంచరణ్.



లోకల్ గైడ్,జిల్లేడు చౌదరి గూడెం.దేశవ్యాప్తంగా కొనసాగుతున్న సర్ ఎన్యూమరేషన్ ప్రోగ్రాం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు తమ సమాచారంను తెలిపి తమ ఓటు హక్కుకు కాపాడుకోవాలని చింతకుంట తండా సర్పంచి దేవి రాంచరణ్ తమ గ్రామ తండా గిరిజనులను కోరారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచి దేవి రాంచరణ్ స్వయంగా సర్ ప్రోగ్రాం లో ఏనుమరేషన్ ఫారాలు నింపుతూ ఓటు హక్కు పై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎనుమరేషన్ ఫారాలు తప్పనిసరిగా ప్రతి ఒక్కరు 2002 ఓట్లను జాబితాలో ఉన్న వివరాలను అందించాలని సూచించారు. లేకపోతే మ్యాపింగ్ చేయడంలో అధికారులు ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. ప్రతి ఓటర్ కు అందించిన రెండు ఫారాలను నింపి ఒకటి ఫోటో అతికించి బిఎల్ఓలకు అందించాలని కోరారు. ఫారాలు నింపడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే గ్రామపంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న సిబ్బందికి అందించాలని కోరారు. గడువులోగా ఓటర్లు సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఓటు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఎల్ఓ లు నవీన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్, అంగన్వాడీ టీచర్ వసంత, బిల్ఏ వినోద్ నాయక్, గ్రామస్తులు రాంచరణ్, ఆదిత్య, అనీల్, తులసీ రాం, హన్మంత్, సేవ్య, శివరాం, గోవింద, మంగ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శివాలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల ముక్తేశ్వరరావుకు డాక్టరేట్ ప్రదానం




కొత్తగూడెం : లోకల్ గైడ్ : సాంస్కృతికం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ప్రగతి నగర్ శివాలయం ప్రధాన అర్చకులు, ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసులు మద్దిరాల ముక్తేశ్వరరావుకు అమెరికన్ యునైటెడ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పుదుచ్చేరిలోని కంభన్ కళైరంగం ఆడిటోరియంలో ఘనంగా డాక్టరేట్ ప్రదానం చేశారు. యూనివర్సిటీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ కె. వెంకటేశం చేతుల మీదుగా ఈ గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ముక్తేశ్వరరావు గత 40 సంవత్సరాలుగా సంగీతం, భజన రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక భజన బృందాలను తీర్చిదిద్ది, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారని నిర్వాహకులు ప్రశంసించారు. హార్మోనియంపై నిరవధికంగా 48 గంటల ప్రదర్శన ఇచ్చిన విశేష ప్రతిభకు గాను ఆయనకు "హార్మోనియం విద్వన్మణి" బిరుదు లభించింది. కాకినాడలో నిర్వహించిన భజన పోటీల్లో ఉత్తమ న్యాయనిర్ణేతగా సేవలందించినందుకు అక్కడి నిర్వాహకులు "స్వర్ణ సింహ కంకణం" తో సత్కరించగా, "సువర్ణ సింహ తలాట సన్మాన" గ్రహీతగా కూడా గుర్తింపు పొందారు. డాక్టరేట్ ప్రదానం చేసిన అమెరికన్ యునైటెడ్ యూనివర్సిటీ యాజమాన్యానికి మద్దిరాల ముక్తేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ప్రాంత అర్చకులు, ప్రముఖులు, శివభక్తులు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## పేటలో ఘనంగా ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణం -- స్మృతివనం భూమిపూజ



నారాయణపేట జూలై 9: నారాయణపేట పట్టణం 9వ వార్డులోని ఎర్రగుట్ట వద్ద నిర్మించనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ అశ్వారూఢ విగ్రహం, స్మృతివనం నిర్మాణానికి సంబంధించిన భూమిపూజ కార్యక్రమం గురువారం వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాద్యాలు, భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పూజ్య నేరడిగం స్వామీజీ భూమిపూజలో పాల్గొని ఆశీర్వచనాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ మహారాజ్ ధర్మరక్షణ, దేశభక్తి, స్వాభిమానానికి ప్రతీక అని పేర్కొన్నారు. శివాజీ మహారాజ్ అడుగుజాడలు ముద్రితమైన నారాయణపేట లో ఆయన విగ్రహ నిర్మాణానికి యువత ముందుకు రావడం అభినందనీయమని, నిర్మించబడుతున్న స్మృతివనం భావితరాలకు స్ఫూర్తి కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. ఈ మహత్తర కార్యానికి తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు చిట్టెం అభిజయ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి, భారతీయ జనతా పార్టీ నారాయణపేట మున్సిపల్ చైర్మన్ శ్రీమతి కొండా సత్యయాదవ్, వైస్ చైర్మన్ శ్రీమతి మంజుల జి.ఆర్. రెడ్డి, నందు నామాజి, భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు పోషల వినోద్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు విజయసాగర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, రఘువీర్ యాదవ్, జనసేన పట్టణ అధ్యక్షులు నరసింహ, ఎంఐఎం పట్టణ అధ్యక్షులు, 23వ వార్డు కౌన్సిలర్ యూసుఫ్ చాంద్, భీష్మరాజ్ ఫౌండేషన్ సభ్యులు తిప్పన్న, భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షులు వెంకోబా, వివిధ వార్డుల కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్ శ్రీమతి శిరీష చిన్నారెడ్డి, నగర ప్రముఖులు మదన్ మోహన్ రెడ్డి, మ్యాడం ప్రభాకర్, బజరంగ్ దళ్ అధ్యక్షులు శావన్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణ కమిటీ తరపున గౌరవాధ్యక్షులు కురుమన్న యాదవ్, యోజన విభాగం అధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి శ్రీపాద కులకర్ణి, పల్లా రఘు, గోపీ కృష్ణ, నవీన్, జీతూ పటేల్, హోటల్ నవీన్, పావాడి మహాదేవ్, ప్రాజెక్టు డిజైన్ ప్లానర్ కేశవ్ కార్యక్రమ నిర్వహణలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. మహిళా కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి సాయి, శ్రీమతి సౌభాగ్య, శ్రీమతి రమాతో పాటు మహిళా కమిటీ సభ్యులు విశేషంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం మరియు స్మృతివనం నిర్మాణం నారాయణపేట చరిత్రలో చిరస్థాయిగా నిలిచే మహత్తర ప్రాజెక్టుగా అవతరించనుందని, ఇది భావితరాల్లో దేశభక్తి, ధర్మం, స్వాభిమాన విలువలను చాటిచెప్పే స్ఫూర్తి కేంద్రంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ మహాయజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## సైబర్ నేరల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి



నారాయణపేట జూలై 9:ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి సూచించారు.నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొల్లంపల్లి గ్రామంలో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంతో పాటు గ్రామాలలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పోలీస్ వాల్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సైబర్ నేరాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఎస్సై సతీష్ రెడ్డి మాట్లాడుతూ అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్, సీవీవీ నంబర్లు, యూపీఐ పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే అనుమానాస్పద లింకులు, నకిలీ ఉద్యోగాలు, పెట్టుబడులు, లాటరీలు, కూరియర్, కేవైసీ అప్‌డేట్ పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.పోలీసులు ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు గ్రామాలలో నూతనంగా పోలీసు వాల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవలను త్వరగా పొందేందుకు పోలీస్ వాల్ ఎంతోఉపయోగపడుతుందని, ఇందులో అత్యవసర సంప్రదింపు నంబర్లు, పోలీసు సేవలకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం అందుబాటులో ఉంటుందని వివరించారు.అలాగే సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా గోల్డెన్ అవర్ లో 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పోలీసులు పాల్గొన్నారు.

## నేషనలిస్ట్ థింకర్స్ ఫోరం సదస్సులో పాల్గొన్న పేట న్యాయవాదులు



నారాయణపేట జూలై 9:హైదరాబాద్ లో గురువారం నిర్వహించిన నేషనలిస్ట్ థింకర్స్ సదస్సు దక్కన్ బంజారా హోటల్ లో జరిగింది.ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మాజీ జాతీయ బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా,గనుల శాఖ మంత్రి జీ.కిషన్ రెడ్డి,బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పాల్గొన్నారు.ఈ సభలో మాట్లాడిన మేధావులు దేశాహితం కోసం పనిచేయాలన్నారు.ప్రజాస్వామపరిరక్షణ అభివృద్ధి కి కృషి చేయాలన్నారు.ఈ సదస్సులో కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్,అదనపు న్యాయవాదులు నందు నామాజీ కురుమన్న గౌడ్ పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ పత్రాల సేకరణలో అలసత్వం వద్దు కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట జూలై 9:ప్రత్యేక ఓటర్ల సవరణలో భాగంగా కొనసాగుతున్న ఎన్యూమరేషన్ పత్రాలు నింపించే ప్రక్రియలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్ర పురపాలిక పరిధిలోని కుమ్మరి వాడ పోలింగ్ కేంద్రం 142, 143 , అలాగే పళ్ళ జంగిగడ్డ పోలింగ్ కేంద్రం నెంబర్ 153 పరిధిలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ పత్రాలు నింపే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. జిల్లాలోని మిగతా మున్సిపాలిటీల కంటే ఎస్. ఐ.ఆర్ ఎన్యూమరేషన్ పత్రాల భర్తీ, స్వీకరణలో స్థానిక మున్సిపాలిటీ వెనుక బడి ఉందని, ప్రతీ బీఎల్ వో రోజుకు వంద పత్రాలలో వివరాలను ఓటర్లతో నింపించి తీసుకోవాలని ఆదేశించారు. ఎన్యూమరేషన్ పత్రాలు నింపడం తెలియవారికి బీ ఎల్ వో లు సహకరించాలని ఆమె సూచించారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు మిస్ కాకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా సూపర్ వైజర్లు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కొంతమంది సూపర్ వైజర్ల పనితీరు సంతృప్తికరంగా లేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని అన్ని వార్డులలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అమరేందర్ కృష్ణ, మున్సిపాలిటీ మేనేజర్ అజీమ్, వార్డు ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## నేడు విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయండి

**నాణ్యమైన విద్యను అందించాలి , కార్పొరేట్ విద్యను అరికట్టాలి , అధిక ఫీజు వసూళ్లు మానుకోవాలి**

**మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం**

**ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు చిలుముల భరత్ ,**

**డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్**



ఖమ్మం జిల్లా, కారేపల్లి (సింగరేణి ) : లోకల్ గైడ్, జులై 9 : విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థి సంఘాల రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బందును జయప్రదం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ )మండల అధ్యక్షుడు చిలుముల భరత్, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ ) మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ పిలుపునిచ్చారు. బందు జయప్రదం ప్రచారం లో భాగంగా వారు మాట్లాడుతూ అధిక ఫీజులు వసూళ్ళు, పాఠశాలలు, కళాశాలలో కేజీ టు పీజీ వరకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని, నాణ్యమైన విద్యను అందించాలని, పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ స్టైఫండ్, బిల్లులు మరియు కాస్మోటిక్ చార్జెస్, మౌలిక సౌకర్యాల కల్పనలో భాగంగా, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ, 23 వేల పైగా పాఠశాల మూసివేత, కార్పొరేట్ విద్యను అరికట్టాలని, ఎం ఈ ఓ డి ఇ ఓ మరియు లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల్లో అత్యధిక ధరలకు అమ్ముతున్న పుస్తకాలు, యూనిఫామ్ లను సరసమైన ధరలకు అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలి వంటి సమస్యల పరిష్కారానికి జరుగుతున్న పని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కారేపల్లి మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు కు విన్నతిపత్రం అందజేయడం జరిగింది.

## 'సర్' పక్రియను పూర్తి చేయని బిఎల్ఓలను విధుల నుండి తొలగించాలి

నాయకుడు హరీష్ గౌడ్



గండిపేట, జూలై 9 (లోకల్ గైడ్): సర్ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను నిర్వహిస్తున్న బిఎల్ఓ అధికారులు మాత్రం వెంటనే విధులు నుండి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు హరీష్ గౌడ్ . గురువారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సామాన్య ప్రజలకు 'సర్' పత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేయాలని ఆయన కోరారు. బి ఎల్ ఓ అధికారులు మాత్రం స్టాల్, టెంట్, చెట్ల కింద కూర్చొని కాలక్షేపం చేసి వెళ్ళిపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం హెల్ప్ డిస్క్ ఏర్పాట్లు చేయమని గాని స్టాల్స్ పెట్టమని గాని చెప్పలేదని వారు అన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న బిఎల్వోలను వెంటనే విధుల నుండి తొలగించాలని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో చాలా ప్రాంతాలలో బి ఎల్ వో లు ఇంటింటికి తిరిగి ఫాన్స్ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. కానీ బండ్లగూడ ప్రాంతంలో చెట్ల కింద కమ్యూనిటీ హాల్, రోడ్ల పక్కన స్టార్స్ ఏర్పాటు చేసుకొని టెంట్లు లలో కూర్చుని ఫోటోలకు ఫోజులిచ్చి, కాలక్షేపం చేసి వెళ్లిపోతున్నారని ఆయన మండిపడ్డారు. సర్ ప్రక్రియ ఇదే విధంగా కొనసాగితే 30% కూడా ఓటర్లకు ఫామ్స్ అందే అవకాశం లేదని అన్నారు. కానీ డిజిటల్ గుణాంకాల మీద మాత్రం అందించినట్టు బి ఎల్ వో లు మాత్రం లెక్క చూపిస్తున్నారు. గవర్నమెంట్ ఇంటింటికి తిరిగి ఫాన్స్ పత్రాలను స్పష్టంగా చదివి ఓటర్లకు వివరించాలని ఆయన కోరారు.

## ఘనంగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ జన్మదిన వేడుకలు



చర్ల : లోకల్ గైడ్ :కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ జన్మదిన వేడుకలు గురువారం చర్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మురళీకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్ హాజరై కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేక్‌ను కట్ చేసి మురళీకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ, చర్ల మండలంతో పాటు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి చీమలమర్రి మురళీకృష్ణ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహిస్తూ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మురళీకృష్ణకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## అధికారులు సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)ప్రభుత్వ అధికారులు,సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండలం తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టికలు,కార్యాలయ రికార్డులు,ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వివరాల నమోదు అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు ప్రభుత్వ అధికారులు,సిబ్బంది విదుల పట్ల సమయపాలన పాటించాలని,వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించాలని తెలిపారు.ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని,ఈ నెల 24లోగా ప్రక్రియ పూర్తి చేసే విధంగా పనులు వేగవంతం చేయాలని తెలిపారు.ఓటర్ల నుండి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాలలో పొందుపరిచిన సమాచారాన్ని బిఎల్ఓ యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు.వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులుగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి భూ భారతి పెండేసి వివరాలను పరిశీలించారు.వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు.అనంతరం నెన్నెల మండలం ఆవడంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల తహసిల్దార్ శ్రీనివాస్ తో కలిసి సందర్శించి తరగతి గదులు,మధ్యాహ్న భోజనం పథకం అమలు,సైన్స్ ఫేర్ నిర్వహణ,రిజిస్టర్లను పరిశీలించారు.అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని,ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు,విద్యుత్,విద్యార్థినీ,విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు,భోజనశాల,అదనపు గదులు,ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించనున్నట్లు తెలిపారు.మంచిర్యాల జిల్లా విద్యారంగంలో దేశంలో,రాష్ట్రంలో ఉన్నత స్థానాలలో నిలిచిందని, జిల్లాలో దాదాపు 320మంది ఉపాధ్యాయులను నియమించామని,అడ్మిషన్లలో జిల్లా మొదటి స్థానంలో ఉందని తెలిపారు.గత సంవత్సరంతో పోలిస్తే ఈ విద్యా సంవత్సరంలో 3శాతం విద్యార్థుల సంఖ్య పెరిగిందని,ఒక గుర్తింపు ద్వారా 75శాతం హాజరు నమోదు అవుతుందని తెలిపారు.జిల్లాలో 700లకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని,ఈ పాఠశాలలలో దాదాపు 44వేల మంది విద్యార్థులు చదువుతున్నారని,కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో సకల సౌకర్యాలతో విద్యార్థులకు విద్యా అందిస్తున్నామని తెలిపారు.జిల్లాలో విద్యారంగంలో 150కోట్ల రూపాయలు ఖర్చు అయిందని,ఇందులో సిఎస్ఆర్ 80కోట్ల రూపాయలు,ఈజిఎస్ 20కోట్ల రూపాయలు,సమగ్ర శిక్ష 11కోట్ల రూపాయలు,నాబార్డు 6కోట్ల రూపాయలు,ప్రధానమంత్రి జన్ మన్ 3కోట్ల రూపాయలు,ప్రధానమంత్రి రోజ్ గార్ 3కోట్ల రూపాయలతో పాటు ప్రభుత్వ నిధులతో పాఠశాలల అభివృద్ధి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.హరే రామ హరే కృష్ణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలను కల్పిస్తున్న సౌకర్యాలతో పాఠశాలలలో అడ్మిషన్లు అడుగుతున్నారని తెలిపారు.

## సర్ ప్రోగ్రాం లో పాల్గొన్న మాజీ సర్పంచ్ దారావత్ బద్రునాయక్



ఖమ్మం జిల్లా, కారేపల్లి (సింగరేణి ) : లోకల్ గైడ్, జులై 9 : ఎన్నికల సంఘము నిర్వహిస్తున్న సర్ ప్రోగ్రాం లో భాగంగా సింగరేణి మండలం పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాలలో ఓటర్ లిస్టులపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్క ఓటరు తమ యొక్క ఓటు పత్రాలను సంబంధిత బిఎల్ఓ లకు అందజేయాలని గ్రామ ప్రజలకు తెలియపరచడం జరిగింది. 2002 సంవత్సరంలో ఓటు హక్కు కలిగిన వారు సర్ పత్రంలోని ఒకటో భాగం, మూడో భాగంలో పూరించి బిఎల్ఓ లకుఅందజేయాలని 2002 సంవత్సరంలో పేర్లు లేని వాళ్ళు రెండో భాగము మరియు మూడో భాగం పూర్తి చేసి అందజేయాలని సూచించారు . ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలంటే తమ యొక్క పత్రాలను పూర్తి చేసి సరైన సమయంలో అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రమేష్ , సంపత్ , లావణ్య , బి ఎల్ ఓ వినాయక , భద్య , భౌసింగ్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికతో కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి సర్పంచ్ లు స్థానిక అవసరాలను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.గురువారం జిల్లాలోని క్యాతనపల్లి పరిధిలోని అమ్మ గార్డెన్స్ లో గ్రామ



సర్పంచ్ లు,పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్,జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు,జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి గణపతి లతో కలిసి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు గ్రామ స్థాయిలో చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో సర్పంచ్ లు,వార్డు సభ్యుల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు.గ్రామాలలో నెలకొన్న సమస్యలను అందుబాటులో ఉన్న వనరులతో పరిష్కరించే విధంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు.గ్రామ పంచాయతీలకు లభించే15వ,16వ ఆర్థిక సంఘం నిధులు,రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు,సాధారణ నిధులు,పన్నుల ద్వారా వచ్చే ఆదాయం,విబిజి రామ్ జీ పథకం తదితర వనరులను సమర్థవంతంగా వినియోగించి గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.గ్రామాల్లో పెరుగుతున్న వీధి కుక్కల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు జంతు పునరుత్పత్తి నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని,పశువైద్య శాఖ ద్వారా శస్త్రచికిత్సలు,యాంటీ రేబిస్ టీకాలు ఉచితంగా అందుబాటులో ఉంటాయని,గ్రామ పంచాయతీలు కుక్కలను పట్టుకోవడం,సంరక్షణ వంటి అంశాలపై దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని తెలిపారు.మురుగునీటి వ్యవస్థలు,ఇంకుడు గుంతలు,కమ్యూనిటీ హాళ్లు,త్రాగునీటి సరఫరా,సౌర విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి పనులకు ప్రభుత్వ పథకాలలో ప్రత్యేక నిధులు అందుబాటులో ఉన్నాయని,ఆయా పథకాల మార్గదర్శకాల ప్రకారం ప్రతిపాదనలు రూపొందించి అమలు చేయాలని తెలిపారు.ఉపాధి హామీ,విబిజి రామ్ జీ పథకాల క్రింద చేపట్టిన పనులకు చెల్లింపులు నిర్ణీత గడువులో జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.పనులు పూర్తయిన వెంటనే బిల్లులు,యుటిలైజేషన్ సర్టిఫికెట్లు,సకాలంలో సమర్పించాలని తెలిపారు.గ్రామ పంచాయతీ నిధులను ప్రజా ప్రయోజనాల కోసమే వినియోగించాలని,నిధుల దుర్వినియోగం,మళ్లింపు జరిగినట్లయితే సంబంధిత పంచాయతీ కార్యదర్శులు,బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం,మహిళా సంఘాల భవనాలు,ఇతర ప్రాధాన్యత కలిగిన మౌలిక వసతుల నిర్మాణానికి అవసరమైన భూమి,పరిపాలనా అనుమతులు జిల్లా యంత్రాంగం నుంచి అందజేస్తామని తెలిపారు.ప్రభుత్వ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు.5ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు కూరగాయల సాగు కోసం పందిళ్ల ఏర్పాటు,బీటీ రహదారులు,మ్యాజిక్ డ్రైన్లు,సౌర విద్యుత్ ఆధారిత వీధి దీపాలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాలలో చేపట్టే అవకాశం ఉందని తెలిపారు.జిల్లా యంత్రాంగం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని,అభివృద్ధి కార్యక్రమాల్లో సర్పంచ్ లు చొరవ తీసుకుని గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.

## సూపర్ ఎల్‌నినో హెచ్చరిక.. వరి సాగుకు బ్రేక్ !

**రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై ప్రభుత్వం కీలక మార్గదర్శకాలు**

**సాగునీరు లేని ప్రాంతాల్లో వరి వద్దు.. రైతులకు మంత్రి ఉత్తమ్ కీలక సూచనలు**

**ఎల్‌నినో ప్రభావం తీవ్రం.. జూలై 15 తర్వాతే పంటలపై తుది నిర్ణయం**



భద్రాద్రి కొత్తగూడెం : లోకల్ గైడ్ (జిల్లా బ్యూరో ) :సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి



ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సాగునీటి లభ్యత లేని ప్రాంతాల్లో వరి సాగు చేయవద్దని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. జూలై 15 తర్వాత జలాశయాల నీటి నిల్వలను సమీక్షించి రైతులకు పంటలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు. జిల్లాలో కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సమావేశంలో పాల్గొని జిల్లాలో చేపడుతున్న చర్యలను వివరించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు 15 శాతం వర్షపాతం లోటు నమోదైందని, కృష్ణా--గోదావరి బేసిన్‌లలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో తాగునీటికి మాత్రమే సరిపడా నీరు ఉందన్నారు. రైతులు పరిస్థితులను అర్థం చేసుకుని నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జూలై 15 తర్వాత జలాశయాల పరిస్థితిని సమీక్షించి ప్రత్యామ్నాయ పంటలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తామని తెలిపారు. ఐటీ మంత్రి శ్రీధర్ బాబు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామసభలు, రైతు వేదికల ద్వారా ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, పంటల మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రైతులు వరికి బదులుగా పత్తి, కందులు, పెసర వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటల వైపు మొగ్గు చూపుతున్నారని వెల్లడించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

## ఈనెల 12న అండర్ 16,19,23 క్రికెట్ ఎంపిక పోటీలు.



బెల్లంపల్లి (లోకల్ గైడ్)తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో ఈనెల 12న మంచిర్యాల,కొమరం భీం జిల్లాల అండర్16,19,23 క్రికెట్ ఎంపిక పోటీలు జరుగుతాయని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పైడిమల్ల నర్సింగ్,కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు,సీనియర్ కోచ్ జాడి శేఖర్ లు తెలిపారు.ఈ ఎంపిక పోటీలు స్థానిక మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీలో జరుగుతాయని వారు తెలిపారు.సెలక్షన్ కి వచ్చే క్రీడాకారులు తమ వెంట సొంత కిట్ బ్యాగు,వైట్ డ్రెస్,ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాలని వారు తెలిపారు.ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు హైదరాబాదులో నిర్వహించే జోనల్ ఎంపిక పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు.వివరాలకు 6281420 180,798109809 ఫోన్ నెంబర్ లలో సంప్రదించాలని వారు తెలిపారు.

## రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా నియమితులైన సందర్భంగా బీఆర్ఎస్



లోకల్ గైడ్. ఖమ్మం. అధినేత కేసీఆర్ మర్యాదపూర్వకంగా కలిసిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర.రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు రాసిన లేఖను కేసీఆర్ ఎంపీ వద్దిరాజుకు అందజేశారు. తనను రాజ్యసభ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా నియమించినందుకు పార్టీ అధినేత కేసీఆర్ వద్దిరాజు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఎంపీని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## పిఆర్టియు టిఎస్ 2026 సంవత్సరానికి సభ్యత్వ కార్యక్రమం




(లోకల్ గైడ్ న్యూస్ కొందుర్గ్)గురువారం కొందుర్గు కేజీబీవీ పాఠశాలలో పిఆర్టియు టి ఎస్ 2026 సభ్యత్వం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కొనగారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమమ్ టైం పేస్కేల్ సాధిస్తామని, ఉపాధ్యాయుల పని వేళలు సడలింపు చేయుటకు అధికారులకు ప్రాథినిత్యం చేస్తామని, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉన్నటువంటి అన్ని సౌకర్యాలు కేజీబీవీ టీచర్లకు కూడా లభించేలా ప్రభుత్వంతో పోరాడుతామని,టీచర్లకు సంబంధించిన వివిధ సమస్యల పరిష్కారానికి పి ఆర్ టి యు తెలంగాణ కృషి చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి కొనగారి కృష్ణారెడ్డి తెలిపారు.ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా పిఆర్టియు మాజీ అధ్యక్షులు కన్నయ్య గారి గోవర్ధన్ యాదవ్, పిఆర్టియు మండల అధ్యక్షులు నాజర్ అలీ గారు ,ప్రధాన కార్యదర్శి వంశీధర్ రెడ్డి కేజీబీవీ ఎస్ ఒ నిస్సీ పాల్గొన్నారు

## విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి...



బెల్లంపల్లి (లోకల్ గైడ్)మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండల పరిధిలోని తాళ్ళగురిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో పురుగులు రావడం అత్యంత బాధాకరమైన విషయం అని యూత్ కాంగ్రెస్ బెల్లంపల్లి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్,ఎన్ఎస్‌యూఐ బెల్లంపల్లి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చిలుముల సాయి కుమార్,ఎన్ఎస్‌యూఐ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు హజీబాబా లు అసహనం వ్యక్తం చేశారు.గురువారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన,పరిశుభ్రమైన భోజనం అందించడం సంబంధిత అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.భోజనంలో పురుగులు రావడం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా వెంటనే విచారణ చేపట్టి,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.మధ్యాహ్న భోజన పథకాన్ని నిరంతరం పర్యవేక్షించి,విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో మళ్లీ జరిగితే యూత్ కాంగ్రెస్,ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రజలకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య,జిల్లా అదనపు కలెక్టర్ వి రాములు,జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ,మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు జిల్లాలో ఈనెల 24వరకు చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని,బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల సేకరణలో అధికారులకు సహకరించాలని తెలిపారు.ఓటరు ఎన్యుమరేషన్ ఫారం నింపడంలో రాజకీయ పార్టీలచే నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించాలని,నింపిన ఫారాలను సేకరించడంలో బూత్ స్థాయి అధికారులతో కలిసి పని చేయాలని తెలిపారు.నింపిన ఫారాలలోని వివరాలను బూత్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు బిఎల్ఓ యాప్ లో నమోదు చేస్తారని తెలిపారు.అర్హత గల ఓటర్లు స్వయంగా ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించాలని,తమ బూత్ స్థాయి ఏజెంట్లు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు,గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులకు వేతనాలను పెంచాలి.

రెండున్నర ఏళ్లనుండి పారిశుధ్య కార్మికులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.


కార్మికులకు తరగతులుగా విభజించి వేతనాలను ఇవ్వాలి .


మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి -టంగుటూరి నరసింహారెడ్డి.



లోకల్ గైడ్, ( లోకల్ గైడ్ ): పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి ) రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరి నరసింహ రెడ్డి డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లేడు చౌదరి గూడెం ఎంపిడిఓ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి సంఘం రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరి నరసింహారెడ్డి మాట్లాడుతూ... గత బిఆర్ఎస్ ప్రభుత్వం మల్టీ పర్పస్ విధానాన్ని తీసుకువచ్చి సమాన పనికి సమాన వేతనం అని కలగూరగంపగా చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రేవంత్ రెడ్డి మేము అధికారంలోకి వస్తే మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేస్తాం ఏ పని చేసినా ఆ పనికి తగ్గ వేతనం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ళు అవుతున్న మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయలేకపోయారని ఆయన ఆరోపించారు. అధికారంలో ఉంటే ఒక మాట అధికారం లేకుంటే మరో మాటలా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు వేతనం పెంచడంలో పూర్తి గా విఫలమైందన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించడంలో ఏ మాత్రం శ్రద్ధ చూపిస్తాలేదన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి డ్రైవర్లకు ఎలక్ట్రీషన్, వాటర్ మెయిన్ కేటగిరీల వారీగా జీతాలు పెంచివ్వాలన్నారు. అలాగే పంచాయతీ కార్మికులకు నెలకి 26 వేల వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య మాట్లాడుతూ చెత్త మురికిలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం ఎందుకు కల్పించరని ప్రశ్నించారు. గ్రామపంచాయతీ పరిధిలో ఇన్సూరెన్స్ కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకొనే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులు చనిపోతే ఎందుకు ఇవ్వడం లేదన్నారు. జాకారం గ్రామపంచాయతీ పరిధిలో ఇదమ్మ కార్మికురాలికి గ్రామపంచాయతీ టాక్టర్ కాలు మీద నుంచి గాయాల పాలైతే పంచాయతీ కార్యదర్శి గాని, గ్రామ సర్పంచి గాని ఎందుకు పట్టించుకోలేదు సమాధానం చెప్పాలన్నారు. గ్రామాలలో వాడు మెంబర్ల నుంచి సర్పంచులు పంచాయతీ కార్యదర్శి అధికారుల వరకు పంచాయతీ కార్మికులపై జులుం చేస్తున్నారు తప్పా వారికి కష్టాలు వచ్చినప్పుడు ఏ ఒక్కరు కూడా ఆదుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య మండల అధ్యక్షులు జి రమేష్ మండల కార్యదర్శి ఫకీర్ అన్వర్ ఉపాధ్యక్షులు పాపయ్య ఇదమ్మ సహయ కార్యదర్శి లక్ష్మయ్య ఆర్ జంగయ్య సమితి సభ్యులు మల్లేష్ బాలమ్మ నర్సమ్మ సరళ జంగయ్య తదితరులు పాల్గొన్నారు

# ఎల్ నినో ప్రభావం గురించి రైతుల్లో అవగాహన కల్పించాలి








నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), జూలై 9 : ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున రైతులకు ఈ విషయమై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. వరికి ప్రత్యామ్నాయంగా నీటి ఎద్దడిని తట్టుకునే ఆరుతడి పంటలను విత్తుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఎల్ నినో వల్ల ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున పంటల సాగుపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. రాష్ట్రంలోని 18 జిల్లాలలో లోటు వర్షపాతం నెలకొని ఉందని వాతావరణ శాఖ అధికారులు మంత్రులు దృష్టికి తెచ్చారు. ఇప్పటివరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం సగటున 887 మిల్లీ మీటర్లు కురియాల్సి ఉండగా, 673 మిల్లీమీటర్ల మాత్రమే కురిసిందని, 24శాతం లోటు వర్షపాతం నమోదు అయ్యిందని వివరించారు. గోదావరి, కృష్ణా బేసిన్ లలో కూడా 20 నుండి 25 శాతం లోటు వర్షపాతం నెలకొని ఉందని అన్నారు. ఎగువన గల మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని ప్రధాన జలాశయాలతో పాటు తెలంగాణలోని సింగూరు, మిడ్ మానేరు, కడెం, శ్రీశైలం, జూరాల, శ్రీరాంసాగర్ తదితర ప్రాజెక్టులలో గత ఏడాదితో పోలిస్తే తక్కువ నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై మంత్రులు జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు కీలక సూచనలు చేశారు. నీటి ఆధారిత పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునే విధంగా రైతులకు ఎల్ నినో ప్రభావం గురించి తెలియజేయాలన్నారు. నీటి ఆధారిత పంటలు వేసినట్లయితే ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉన్నందున రైతులు నష్టపోతారు అనే విషయాన్ని వారికి స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. శ్రీరాంసాగర్ తదితర రిజర్వాయర్లలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన పక్షంలో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను అమలు చేసేందుకు వీలుగా అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉండాలని అన్నారు. కాగా, జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో రైతులకు సరిపడా ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువుల దారి మళ్లింపు వంటి వాటికి ఆస్కారం లేకుండా గట్టి పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి ప్రకాష్, డీఎస్ఓ శ్రీకాంత్, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, డీసీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించాలి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### నీటి లభ్యతకు అనుగుణంగా విత్తనాల సరఫరా ఉండేలా చర్యలు, తీసుకోవాలి:మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



లోకల్ గైడ్ సిద్దిపేట, జూలై 9: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, జలాశయాల్లో నీటి నిల్వలు, ఖరీఫ్ పంటల ప్రణాళికపై రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జూలై 9 నాటికి రాష్ట్రంలో 15 శాతం వర్షపాతం లోటు నమోదైందన్నారు. కృష్ణా బేసిన్‌లో గతేడాదితో పోలిస్తే నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని, ఎగువ రాష్ట్రాల నుంచి ఇప్పటివరకు ఎలాంటి నీటి ప్రవాహం రాలేదని తెలిపారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ప్రస్తుతం తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపడా నీరు ఉందన్నారు. గోదావరి బేసిన్‌లోని ఎస్సారెస్పీ, నిజాంసాగర్, సింగూరు, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు ఇంకా వరద నీరు చేరలేదని, వచ్చే వారం రోజులపాటు భారీ వర్షాల అవకాశాలు కూడా లేవని వాతావరణ శాఖ అంచనా వేసిందన్నారు.ఈ సీజన్‌లో ఆగస్టులో మాత్రమే సాధారణానికి సమీపంలో వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, జూలైలో 25 శాతం, ఆగస్టులో 9 శాతం, సెప్టెంబరులో 42 శాతం, అక్టోబరులో 55 శాతం వరకు వర్షపాతం లోటు ఉండే అవకాశం ఉందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వచ్చే వరదలపైనే కృష్ణా, గోదావరి ప్రాజెక్టులు నిండే పరిస్థితి ఆధారపడి ఉందని, ఆ అవకాశాలు కూడా పరిమితంగానే ఉన్నాయని తెలిపారు.గోదావరి, కృష్ణా బేసిన్‌లలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున ఈ ఖరీఫ్‌లో సాగునీటి విడుదలకు ప్రణాళికలు లేవని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా సాధ్యమైన మేరకు నీటిని తరలించి చెరువులు, కుంటలను నింపేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సాగునీటి లభ్యత లేని ప్రాంతాల్లో వరి సాగు చేయకుండా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. రైతు వేదికలు, ప్యాక్స్‌ల ద్వారా నీటి లభ్యత, వర్షపాతం అంచనాలు, ఎల్‌నినో ప్రభావంపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని ఆదేశించారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు, వరదలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా విత్తనాల సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూలై 15 తర్వాత జలాశయాల్లో నీటి నిల్వలను సమీక్షించి ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.




ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద వస్తే వెంటనే నీటిని ఎత్తిపోసేందుకు పంపింగ్ వ్యవస్థలను సిద్ధంగా ఉంచాలని, అప్పటివరకు అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలని తెలిపారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించాలని, ఆయిల్‌పామ్, ఉద్యాన పంటలు, పట్టు పరిశ్రమకు అనుకూలమైన పంటలు, తక్కువ నీటితో సాగయ్యే పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ముందుగానే సిద్ధంగా ఉంచి రైతులకు వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, ఎస్సీ ఇరిగేషన్ నాగరాజు, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ డ్యూటీ మీట్‌లో సిద్దిపేట పోలీసుల సత్తా..
## 10 మంది విజేతలకు సీపీ రష్మీ పెరుమాళ్ అభినందనలు




లోకల్ గైడ్ సిద్దిపేట, జూలై 9: జోన్-3 పరిధిలోని కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి జిల్లాల పోలీసు సిబ్బందికి నిర్వహించిన జోనల్ స్థాయి డ్యూటీ మీట్ విజయవంతంగా ముగిసింది. దర్యాప్తులో నైపుణ్యం, ఫోరెన్సిక్ పరిజ్ఞానం, సైబర్ అవగాహన, ఆధునిక సాంకేతిక సామర్థ్యాల పెంపు లక్ష్యంగా 21 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సిద్దిపేట జిల్లా పోలీసు సిబ్బంది ప్రతిభ కనబరిచి మొత్తం 10 మంది విజేతలుగా నిలిచారు. సైంటిఫిక్ దర్యాప్తు విభాగంలో ఎస్ఐ రఘుపతి ద్వితీయ స్థానం, అబ్జర్వేషన్ పరీక్షలో ఏఎస్సై మధుసూదన్ ప్రథమ స్థానం, కంప్యూటర్ అవగాహన విభాగంలో పీసీలు హరికృష్ణ, భాస్కర్, రమేష్ ప్రథమ స్థానం, నార్కోటిక్స్ విభాగంలో పీసీలు వెంకటేష్, శంకర్, అజయ్ ద్వితీయ స్థానం, వాహన తనిఖీ విభాగంలో పీసీ నగేష్ తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా విజేతలను సిద్దిపేట పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించి, రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌లోనూ జోన్-3కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జోనల్ స్థాయిలో విజయం సాధించిన ఈ విజేతలు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌లో జోన్-3కు ప్రాతినిధ్యం వహించనున్నారు.


## అనువైన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి .

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.




వనపర్తి లోకల్ గైడ్ ప్రతినిధి 9:వాతావరణం లో ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడుచున్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని రైతులకు అనువైన పంటల సాగు పై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం వల్ల ఇప్పటి వరకు జిల్లాల వారీగా కురిసిన వర్షాలు, రిజర్వాయర్ లో ఉన్న నీటి లభ్యత, రైతులకు ఇవ్వాల్సిన సూచనల పై రాష్ట్ర ఇరిగేషన్, సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో ఇప్పటి వరకు లోటు వర్షపాతం నమోదు అయ్యాయని, రానున్న మూడు నెలలు సైతం ఆశించిన స్థాయిలో వర్షాలు పడే అవకాశం లేదని వాతావరణ శాఖ నివేదికలు ఇస్తున్న నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లు జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి రైతులకు పంట మార్పిడి పై తగిన సూచనలు, సలహాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి కలెక్టర్లను సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇరిగేషన్, వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జూరాల, రామన్ పాడ్ రిజర్వాయర్ లో ఉన్న నీటి నిల్వలు, రిజర్వాయర్ లోకి వస్తున్న నీటి పై ఇరిగేషన్ అధికారులకు వివరాలు అడిగారు. ప్రస్తుతం జూరాలకు పై నుండి ఎలాంటి నీటి ప్రవాహం లేవని, మహారాష్ట్ర కర్ణాటకలో వర్షాలు బాగా పడితే ఆల్మట్టి నుండి నీరు వదిలితే కాస్త వచ్చే అవకాశం ఉందని అవి తాగు నీటికి సరిపోతుందని ఇరిగేషన్ సి.ఈ రహిమొద్దీన్ వివరించారు. స్పందించిన కలెక్టర్ నీటి లభ్యత, ఎల్ నినో ప్రభావం దృష్ట్యా మండలాల వారిగా రైతులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేసే విధంగా అవగాహన కల్పించాల్సిందిగా విషయం వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. బోరు ఉండి రెండెకరాలకు పైన ఉన్న రైతులు పామాయిల్ పంట సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మినుములు, కందులు వంటి ఇతర పంటలు సాగు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, ఇరిగేషన్ సీఈ రహీముద్దీన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు, ఉద్యానవన శాఖ అధికారి విజయ భాస్కర్, ఇరిగేషన్ ఈ ఈ లు, డి. ఈ లు తదితరులు పాల్గొన్నారు.

## జూలై 18న చెక్ బౌన్స్ కేసుల స్పెషల్ లోక్ అదాలత్..
## రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచన





లోకల్ గైడ్ సిద్దిపేట, జూలై 9: తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ, సిద్దిపేట ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించనున్న ఎన్ఐ యాక్ట్ (చెక్ బౌన్స్) కేసుల స్పెషల్ లోక్ అదాలత్ విజయవంతం చేయడంపై ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి. సుదర్శన్ ప్రెస్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో ప్రస్తుతం 1,324 చెక్ బౌన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జూలై 18న నిర్వహించే స్పెషల్ లోక్ అదాలత్‌లో కక్షిదారులు పరస్పర రాజీ ద్వారా తమ కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఎక్కువ సంఖ్యలో చెక్ బౌన్స్ కేసులు రాజీ ద్వారా పరిష్కారమయ్యేలా న్యాయవాదులు, కక్షిదారులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎన్. సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు హరీశ్ రావు ఐప్యాడ్‌లు..
## వచ్చే ఏడాది టాప్-50 మందికి అందజేస్తానని హామీ




లోకల్ గైడ్ సిద్దిపేట, జూలై 9: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, సిద్దిపేటలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 31 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆయన గురువారం తన సొంత ఖర్చులతో ఐప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల తన హృదయానికి అత్యంత దగ్గరైన పాఠశాల అని పేర్కొన్నారు. ఈ పాఠశాల రాష్ట్రంలోనే ఉత్తమ ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటిగా నిలవడానికి ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ రాజప్రభాకర్ రెడ్డి కృషే ప్రధాన కారణమని కొనియాడారు. సిద్దిపేటలో ప్రైవేట్, గురుకుల పాఠశాలలు అధికంగా ఉన్నప్పటికీ, 1,234 మంది విద్యార్థులతో ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుందని అన్నారు. పాఠశాలలో ప్రవేశాల కోసం ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల నుంచి కూడా సిఫార్సులు వస్తుండటం ఆ పాఠశాలపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని తరగతి గదులు నిర్మించి పాఠశాలను మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది టాప్ మార్కులు సాధించిన 31 మంది విద్యార్థులకు ఐప్యాడ్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు.



వచ్చే ఏడాది అత్యుత్తమ ప్రతిభ కనబరిచే టాప్-50 మంది విద్యార్థులకు ఐప్యాడ్‌లు అందజేస్తానని ప్రకటించారు. ఈ ఐప్యాడ్‌లలో ఇంటర్నెట్ సదుపాయం లేదా గేమ్స్ ఉండవని, కేవలం స్టడీ మెటీరియల్, జనరల్ నాలెడ్జ్, ఇంటర్మీడియట్‌కు సంబంధించిన విద్యా సమాచారం మాత్రమే అందుబాటులో ఉంటుందని వివరించారు. విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండి చదువుపై పూర్తి దృష్టి పెట్టాలని, తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుకు అనుకూల వాతావరణం కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయుల సేవలను అభినందించిన హరీశ్ రావు, పాఠశాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు కృషి కొనసాగుతుందని హామీ ఇచ్చారు.

## జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష-
## 2027కు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి:

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి .



వనపర్తి లోకల్ గైడ్ ప్రతినిధి జులై 9:జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్ ( జే ఎన్ వీ ఎస్ టీ)-2027 ద్వారా 2027-28 విద్యా సంవత్సరానికి వట్టెం 6వ తరగతిలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు జూలై 31, 2026 చివరి తేదీ అని పేర్కొన్నారు. అభ్యర్థులువెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష నవంబర్ 28, 2026న నిర్ణయించిన పరీక్షా కేంద్రాల్లో నిర్వహించబడుతుందని తెలిపారు. జిల్లాలో అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి కోరారు. అలాగే విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు ప్రవేశాలపై విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## ఒక్క మైనారిటీ ఓటు కూడా తొలగిపోనివ్వం..
## ఎస్ఐఆర్ దరఖాస్తులు తప్పనిసరిగా పూర్తి చేయాలి: హరీశ్ రావు



లోకల్ గైడ్ సిద్దిపేట, జూలై 9: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మైనారిటీ ఓటర్లు తప్పనిసరిగా దరఖాస్తులు పూర్తి చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముస్లిం మైనారిటీ మత పెద్దలు, నాయకులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో ఆందోళన నెలకొన్నప్పటికీ భయపడాల్సిన అవసరం లేదని, ప్రతి ఓటరు ముందుగానే దరఖాస్తు నింపి బూత్ లెవల్ అధికారికి (బీఎల్ఓ) సమర్పించాలని సూచించారు. 2002 ఓటరు జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను మ్యాపింగ్ చేసి దరఖాస్తులో నమోదు చేయాలని చెప్పారు. పాత ఓటరు గుర్తింపు కార్డుల్లో పేర్ల స్పెల్లింగ్ తప్పులు ఉన్నవారు కూడా ఈ ప్రక్రియలో సరిచేసుకోవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్ఐఆర్ ప్రక్రియను అధికారులు ద్వారా సీరియస్‌గా అమలు చేస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హరీశ్ రావు విమర్శించారు. మైనారిటీ ఓట్ల తొలగింపునకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ, అలాంటి పరిస్థితి తెలంగాణలో రానివ్వబోమన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు సహకారం అందిస్తోందని, సిద్దిపేటలో అన్ని వార్డుల్లో పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించామని తెలిపారు. తాను కూడా ఎస్ఐఆర్ దరఖాస్తు పూర్తి చేశానని, ప్రతి ఒక్కరూ రెండు దరఖాస్తులు నింపి ఒకటి బీఎల్ఓకు ఇచ్చి, మరొక దరఖాస్తుపై స్వీకరణ సంతకం తీసుకుని తమ వద్ద భద్రపరుచుకోవాలని సూచించారు. నోటీసులు ఇవ్వకుండా ఎవరి ఓటునూ తొలగించే హక్కు ఎవరికీ లేదని పేర్కొన్న హరీశ్ రావు, అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, పత్రాలు లేని వారికి తహసీల్దార్ ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందేలా సహకరిస్తామని తెలిపారు. ఒక్క మైనారిటీ ఓటు కూడా తొలగిపోకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## రెడ్ క్రాస్‌లో తలసీమియా
## పేరెంట్స్ లాంజ్ శిలాఫలకం ఆవిష్కరించిన గవర్నర్

రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం-గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా...వెల్లడి



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూలై09(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండ, సుబేదారి లోని రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో తలసీమియా బాధితుల కుటుంబ సభ్యుల కోసం వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న డైనింగ్ హాల్ పై నిర్మించనున్న తలసీమియా పేరెంట్స్ లాంజ్ శిలాఫలకాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు శివ ప్రతాప్ శుక్లా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు చాహత్ బాజ్‌పాయ్, రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు గవర్నర్‌కు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు బ్యాండ్‌తో గౌరవ వందనం అందించారు. అనంతరం గవర్నర్ రెడ్ క్రాస్ ప్రాంగణంలోని తలసీమియా పేరెంట్స్ లాంజ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, తలసీమియా సెంటర్‌ను సందర్శించి చిన్నారులు, వారి తల్లిదండ్రులతో ఆత్మీయంగా మాట్లాడి పండ్లు పంపిణీ చేశారు. తదుపరి రెడ్ క్రాస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పాలకవర్గం గవర్నర్‌కు వివరించింది అన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, తలసీమియా బాధితుల తల్లిదండ్రుల సౌకర్యార్థం పేరెంట్స్ లాంజ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రక్తదాన సేవలతో పాటు ఆరోగ్యం, మానవతా సేవలలో హనుమకొండ రెడ్ క్రాస్ విశిష్ట సేవలు అందిస్తోందని ప్రశంసించారు. రెడ్ క్రాస్ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చర్చిస్తానని తెలిపారు. తలసీమియా బాధితులకు అందిస్తున్న సేవలకు రెడ్ క్రాస్ పాలకవర్గాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా అన్ని విధాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రెడ్ క్రాస్ పాలకవర్గం గవర్నర్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా



సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం . దాన కిషోర్, కుడా మాజీ చైర్మన్ ఇనుగాల వెంకట్ రామ్ రెడ్డి, హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డా. పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, డా. ఎం. శేషుమాధవ్, డా. కె. సుధాకర్ రెడ్డి, డా. సీహెచ్. సంధ్యారాణి, బిళ్ల రమణారెడ్డి, జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే అంటువ్యాధుల నివారణ..
## తీగుల్ పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ డా. ధనరాజ్



లోకల్ గైడ్ సిద్దిపేట, జూలై 9: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా అంటువ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డా. సి. హెచ్. ధనరాజ్ అన్నారు. గురువారం ఆయన తీగుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవల నిర్వహణను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపీ సేవలు, ప్రయోగశాల, ఫార్మసీ, ఔషధ నిల్వలు, వివిధ రిజిస్టర్లు, జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. పర్యవేక్షక సిబ్బంది అన్ని కార్యక్రమాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, అంటువ్యాధి కాని వ్యాధుల (ఎన్‌సీడీ) స్క్రీనింగ్‌ను విస్తరించాలని, శాతం వంద యూనివర్సల్ ఇమ్యునైజేషన్ లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచడంతో పాటు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమైన డీఎంహెచ్ఓ, డెంగ్యూ నివారణ, దోమల నియంత్రణ, పారిశుద్ధ్య నిర్వహణ, మాతృ-శిశు సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలకు ఆరోగ్య సేవలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో నిల్వ నీరు లేకుండా పరిశుభ్రత పాటిస్తే డెంగ్యూ వంటి అంటువ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఈ తనిఖీలో వైద్యాధికారి డా. కిరణ్, సీసీ పాషా, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కారేపల్లి మండలంలో
## రైతు ఆశీర్వాద బహిరంగ సభ వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

మండలం లో అన్ని గ్రామాలలో ప్రచారం నిర్వహించిన కాంగ్రెస్ నేతలు



ఖమ్మం జిల్లా, కారేపల్లి (సింగరేణి ): లోకల్ గైడ్, జులై 9 : చింతకాని మండలం జగన్నాథపురం లో జరిగే ముఖ్యమంత్రి బహిరంగ సభ కు సంబంధించిన గోడ ప్రతులను మండల కాంగ్రెస్ శ్రేణులు మండల పరిధి లో అన్ని గ్రామాలలో ఆవిష్కరణ చేసి గ్రామాల నుండి ప్రజలు అధిక సంఖ్యల్లో హాజరు కావాలని ప్రజలకోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని కోరారు, ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బానోత్ రామ్మూర్తి నాయక్, మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్ రావు,జిల్లా నాయకులు గుగులోత్ భీముడు నాయక్, సొసైటీ డైరెక్టర్ అడ్డగోడా ఐలయ్య, మాజీ ఎంపీటీసీ పెద్దబోయిన ఉమా శంకర్, కో ఆప్షన్ మాజీ సభ్యులు హనీఫ్, మాజీ సర్పంచ్ నరేష్ వివిధ గ్రామలా సర్పంచ్ లు ఉమారాణి, మోతి వీరాస్వామి, బాలు,టోనీ, హీరాలాల్ పద్మావతి వెంకటేశ్వర్లు, లలిత, భూలి, క్రిష్ణ వేణి,రాజు, వరలక్ష్మి,, హేమలత, ఎల్లయ్య, మాతృ, హనుమంతారావు, కిషోర్, నాయకులు అప్పరావు లక్ష్మి వీరన్న తదితరులు పాల్గొన్నారు

## వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన
## రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క




ములుగు జిల్లా ప్రతినిధి( లోకల్ గైడ్ )మంత్రి దనసరి అనసూయ సీతక్క పుట్టినరోజు సందర్భంగా జిల్లా కేంద్రంలోని డి ఎల్ ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన వేడుకల్లో ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి చైర్మన్ పదవి పొంది సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా రేగ కల్యాణి ని మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి రెడ్డి ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ ఆత్మ కమిటీ జిల్లా చైర్మన్ చిటమట రఘు ,సీనియర్ నాయకులు చైర్మన్లు, డైరెక్టర్లు,యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఐటీ కంపెనీల్లో కార్లు అటాచ్‌మెంట్ ఇప్పిస్తామని మోసం..

ఇద్దరు అరెస్ట్ మూడు కార్లు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం



ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతినిధి,జూలై 09(లోకల్ గైడ్ న్యూస్):వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఏ.జే. మిల్స్ కాలనీ పోలీసులు వాహన యజమానులను ఐటీ కంపెనీల్లో అటాచ్‌మెంట్ ఇప్పిస్తామని నమ్మించి కార్లు తీసుకుని, వాటిని ఇతరుల వద్ద తాకట్టు పెట్టి లక్షల రూపాయలు కాజేసిన ముఠాకు చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మూడు కార్లు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మొహమ్మద్ సోహైల్ అనే బాధితుడి మారుతి డిజైర్ కారును నెలకు రూ. 35 వేల అద్దె వస్తుందని నమ్మించి నిందితుడు సింగారపు శ్యామ్ కుమార్ తీసుకున్నాడు. మొదట అడ్వాన్స్‌గా రూ. 35 వేలు చెల్లించిన అనంతరం వాహనాన్ని ఇతరుల వద్ద తాకట్టు పెట్టి, అద్దె చెల్లించకుండా మోసానికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇదే తరహాలో పలువురు వాహన యజమానులను మోసం చేసినట్లు విచారణలో తేలింది. గురువారం రోజున తెలంగాణ జంక్షన్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీలలో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న సింగారపు శ్యామ్ కుమార్ (ఏ1), ఎం.డి. సోహైల్ (ఏ2)లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుంచి ఒక మారుతి డిజైర్ కారును స్వాధీనం చేసుకోవడంతో పాటు, వారి సమాచారంతో చింతల్ ఫ్లైఓవర్ కింద దాచిపెట్టిన మరో రెండు కార్లు (మారుతి ఎర్టిగా, మారుతి బలెనో) మరియు నేరాలకు ఉపయోగించిన హెచ్ఎమ్‌డీ కీప్యాడ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సింగారపు శ్యామ్ కుమార్ గతంలో కూడా ఇలాంటి మోసాలకు పాల్పడి, చెన్నారావుపేట, ఇంటేజార్‌గంజ్, ఏ.జే. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లలో నమోదైన పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇతర బాధితులను గుర్తించడం, మిగిలిన వాహనాలను స్వాధీనం చేసుకోవడం, డిజిటల్, ఆర్థిక ఆధారాలను సేకరించడం వంటి అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఏ.జే. మిల్స్ కాలనీ పోలీసులు వెల్లడించారు.

# రిప్లెక్టర్లు (రేడియం స్టిక్కర్లు) ప్రతి వాహనానికి తప్పనిసరి.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: జిల్లా రవాణా అధికారి శంకర్ నాయక్.



మహబూబాబాద్ జిల్లా, జూలై 9: రోడ్డు ప్రమాదాల నివారణ, వాహన భద్రతను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ప్రతి వాహనానికి ప్రభుత్వం నిర్దేశించిన రిప్లెక్టర్లు (రేడియం స్టిక్కర్లు) తప్పనిసరిగా అమర్చాలని మహబూబాబాద్ జిల్లా రవాణా అధికారి శంకర్ నాయక్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నిబంధనలను జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.ప్రతి వాహనం ముందు భాగంలో వైట్ కలర్ రిప్లెక్టర్లు (రేడియం స్టిక్కర్లు), వెనుక భాగంలో రెడ్ కలర్ రిప్లెక్టర్లు (రేడియం స్టిక్కర్లు), రెండు వైపులా ఆరెంజ్ లేదా పసుపు రంగు రిప్లెక్టర్లు (రేడియం స్టిక్కర్లు) తప్పనిసరిగా అమర్చాలని సూచించారు. ముఖ్యంగా ట్రాక్టర్లకు అనుసంధానించే ట్రైలర్లు (తొట్టీలు) వెనుక భాగంలో రెడ్ కలర్ రిప్లెక్టర్లు (రేడియం స్టిక్కర్లు) ఏర్పాటు చేయడం తప్పనిసరి అని పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం 2026 ఫిబ్రవరి 20 నుంచి క్యూఆర్ ఆధారిత మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎం ఐ ఎస్) ద్వారా ధృవీకరించిన రిప్లెక్టర్ (రేడియం స్టిక్కర్) స్టిక్కర్లను మాత్రమే వినియోగించాలని ఆదేశించిందన్నారు. రాత్రి వేళలు, వర్షాకాలం, పొగమంచు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఈ రిప్లెక్టర్లు వాహనాలను దూరం నుంచే స్పష్టంగా గుర్తించేలా చేసి రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.మోటారు వాహనాల నియమాలు--1989లోని రూల్--104 ప్రకారం రిప్లెక్టర్లు (రేడియం స్టిక్కర్లు) లేని వాహనాలు ప్రమాదాలకు కారణమైతే సంబంధిత వాహన యజమాని, డ్రైవర్‌పై పోలీసులు కేసులు నమోదు చేయడంతో పాటు రవాణా శాఖ అధికారులు జరిమానాలు విధిస్తారని చెప్పారు. అదనంగా డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆరు నెలల వరకు సస్పెండ్ చేయడంతో పాటు నిబంధనల ప్రకారం మూడు నెలల వరకు జైలు శిక్ష, రూ.5,000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు.అందువల్ల అన్ని వాహన యజమానులు తమ వాహనాలకు ప్రభుత్వం ఆమోదించిన క్యూఆర్ ఆధారిత ఎంఐఎస్ ధృవీకరించిన రిప్లెక్టర్లు (రేడియం స్టిక్కర్లు) తప్పనిసరిగా అమర్చడంతో పాటు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండి రోడ్డు భద్రతకు సహకరించాలని జిల్లా రవాణా అధికారి శంకర్ నాయక్ విజ్ఞప్తి చేశారు.

## గాజుల మల్లన్నకు ఆకుతోట కుమారస్వామి ఆత్మీయ పరామర్శ



చిట్యాల. జులై 9 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పర్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాజుల మల్లయ్య తల్లి గాజుల ఐలక్క ఇటీవల మృతిచెందగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి గురువారం రోజున ఆత్మీయంగా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనారోగ్యంతో మృతి చెందిన గాజుల ఐలక్క ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ పార్వతీ పరమేశ్వరుల దంపతుల ఆశీస్సులతో ఆమె ఆత్మకు స్వర్గలోక ప్రాప్తిరస్తు కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్, సీనియర్ జర్నలిస్టు బొల్లెపల్లి రమేష్ గౌడ్, ఆమె కుమారులు రాజయ్య గౌడ్, మల్లయ్య గౌడ్, తిరుపతి గౌడ్, కుమార్తెలు అరుణ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ చిట్యాల శాఖ ఆధ్వర్యంలో 78వ ఆవిర్భావ దినోత్సవ శీ ఘనంగా జరుపుకున్నారు

చిట్యాల. జులై 9 : జై శంకర్ జిల్లా భూపాలపల్లి చిట్యాల మండలం అంబేద్కర్ చౌరస్తాలో




ఈసందర్భంగా మండల హాస్టల్స్ సెక్రటరీ బుర్ర అభిగ్న ఎబివిపి జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది .1949 జూలై 9న ఐదుగురు తో ప్రారంభం ఆయన ఎబివిపి సంస్థ . ఈ రోజు దేశంలోనే అతిపెద్ద విద్యార్థి పరిషత్ సంస్థగా పేర్కొంది. ఈ సందర్భంగా బుర్ర అభిగ్న.మాట్లాడుతూ విద్యార్థులు మధ్యకదవ్యలకు దూరం ఉండాలి అని .. విద్యార్థులో దేశభక్తి క్రమశిక్షణ ,నాయకత్వ లక్షణాలు మరియు సేవా భావం పెంపొందించడానికి ఎబివిపి ది ప్రధాన లక్ష్యం అని అన్నారు. చదువే కాకుండా చదువుతో పాటు సామాజిక సేవలు బాధ్యతలను కూడా గుర్తించి కృషి చెయ్యాలని అని.అంతే కాకుండా. దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బుర్ర .నాగరాజు సాయి బన్నీ.. పూర్వ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 13న టి.డబ్ల్యూ.జే.ఎఫ్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం..

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా:



: కీసర సర్కిల్ జవహర్ నగర్.జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మేడ్చల్ నియోజకవర్గ కన్వీనర్ అంబాల విష్ణు పిలుపు...జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళన కార్యక్రమంలో భాగంగా (టి డబ్ల్యూ జె ఎఫ్)13,వ తేదీన మేడ్చల్ కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా ను విజయవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) మేడ్చల్ నియోజకవర్గం కన్వీనర్ అంబాల విష్ణు పిలుపు నిచ్చారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత చొరవ చూపాలని అభిప్రాయపడ్డారు.ఈ నెల13న జిల్లా కలెక్టర్కు వినతిపత్రాలు అందజేసి నిరసనలు తెలిపామని తెలిపారు. 15న రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. జర్నలిస్టుల హెల్త్‌కార్డుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు.హెల్త్ కార్డులు నిమ్స్ ఆస్ప్రతి మినహా ఏ ఇతర కార్పొరేట్ ఆస్ప్రతుల్లో పని చేయడం లేదని వ్యాఖ్యనించారు. వెంటనే జర్నలిస్టులందరికీ నూతన హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో క్యాబినెట్ సబ్ కమిటీ ఇండ్ల స్థలాలపై నిర్ణయం తీసుకోకపోవడంతో కార్యాచరణ ముందుకు సాగడం లేదని తెలిపారు.ఇండ్ల స్థలాల విషయంలో సర్కారు జర్నలిస్టులకు ఆశలు కల్పించి ఆ తర్వాత వారి ఆశలపై నీళ్లు చల్లుతోందని విమర్శించారు.అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ఆలస్యమవుతున్నదని,అర్హులైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.అక్రిడేషన్ కార్డులు ఆలస్యం కావడంతో బస్‌పాసులు రాక జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తేచేశారు.జర్నలిస్టులకు పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రయివేట్,కార్పొరేట్ విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కోరారు.దీనిపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయాలని విష్ణు విజ్ఞప్తి చేశారు..

# మౌలిక సదుపాయాలు, ప్రజలకు ఉపయోగపడే ప్రణాళికలు సర్పంచులు కార్యదర్శులు తయారు చేయాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు





చిట్యాల. జులై 9 : జయశంకర్ జిల్లా భూపాలపల్లి గ్రామాలాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. పంచాయతి రాజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఐడిఓసి కార్యాలయంలో గ్రామ పంచాయతి అభివృద్ధి ప్రణాళికలు అంశంపై చిట్యాల, కొత్తపల్లి గోరి, రేగొండ, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన అవగహన సదస్సును జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు, ప్రజలకు ఉపయోగపడే ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతిలు ఆదాయ వనరులు సొంతంగా సమకూర్చుకోవాలని సూచించారు. గ్రామాల నుండి దేశ, విదేశాలలో నివసిస్తున్న ప్రముఖులు ద్వారా గ్రామాలు అభివృద్ధికి నిధులు సమకూర్చుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు పోటీతత్వంతో కృషి చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా వస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 320 కోట్లతో మొరంచపల్లి వాగుపై చెక్ డ్యామ్ లు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పంట కాలువలు సిమెంట్ లైనింగ్ కొరకు 55 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. టిబిఎం 38 ద్వారా 44700 ఎకరాలకు సాగునీరు అందించేందుకు డిపిఆర్ సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సర్పంచులు లీడ్ తీసుకోవాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి మొదటి, రెండు, మూడు సంవత్సరాలకు ప్రణాళికలు తయారు చేయాలని, అట్టి ప్రణాళిక సంవత్సరం వారీగా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామ, మండల ప్రణాళికలు కనుగుణంగా జిల్లా స్థాయి ప్రణాళిక తయారు చేయనున్నట్లు తెలిపారు. మిషన్ భగీర ద్వారా మంచినీటి సరఫరా చేయాలని ఎక్కడైనా నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైనట్లయితే ప్రత్యామ్నాయంగా మంచినీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మంచినీటి సమస్య ఎట్టి పరిస్థితిలోను నీటి ఎద్దడి రావొద్దని స్పష్టం చేశారు. తడి, పొడి వ్యర్థాలు నిర్వహణ 16 ఆర్థిక సంఘం నిధులు వినియోగం పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. గ్రామాల నుండి అభివృద్ధి జరగాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధికి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఇట్టి శిక్షణ కార్యక్రమాలను వినియోగించి గ్రామాలు అభివృద్ధిని సాధించాలని సూచించారు. జిల్లాలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. అట్టి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతను బట్టి మొదటి, రెండవ, మూడు సంవత్సరాలలో పరిష్కరించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, ఆయా మండలాల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి మెడికేర్ హాస్పిటల్ సేవలు అభినందనీయం





తొర్రూరు, జులై 9 గ్రామీణ ప్రాంతాల్లో మెడికేర్ హాస్పిటల్ యాజమాన్యం సహకారంతో పలు స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఔతాపురం గ్రామ సర్పంచ్ తోటకూర శ్రీనివాస్ సూచించారు. తొర్రూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పెద్దవంగర మండలం ఔతాపురం గ్రామంలో గురువారం తొర్రూరు పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యశాల మెడికేర్ హాస్పిటల్ వారి సహకారంతో, బాలవికాస స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం మెడికేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యం కోసం మెడికేర్ హాస్పిటల్ యాజమాన్యం నిర్వహిస్తున్న వైద్య సేవలు వెలకట్టలేనివని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మెడికేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ నర్మెటి రాము మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో తమ మెడికేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో తొర్రూరు రెవిన్యూ డివిజన్ పరిధిలోని తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి, దంతాలపల్లి మండలాల్లో ప్రస్తుత వర్షాకాల సీజన్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని వైద్యుల సూచనలు పాటించి ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని రాము సూచించారు. తమ మెడికేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవసరమైన వారికి అత్యవసరకాలంలో ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరంలో మెడికేర్ హాస్పిటల్ కు చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ కోటా నరేష్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అనారోగ్య సూచనలు కనిపించినా ఆలస్యం చేయకుండా వెంటనే పరిధిలోని సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత వర్షాకాల సీజన్లో ప్రజలు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలు గురించి డాక్టర్ నరేష్ ప్రజలకు వివరించారు. ఈ మధ్య శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలవికాస సంస్థ ప్రతినిధి బృందం, మెడికేర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు సర్వే చేసి భూమికి హద్దులు నిర్ణయించాలి

తొర్రూరు, జూలై 9: గ్రామాల్లో భూ వివాదాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, భూములకు స్పష్టమైన హద్దులు నిర్ణయించాలని రైతు సురేష్ యాదవ్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూపాత రికార్డులు, సరిహద్దు రాళ్లు లేకపోవడం తో పొరుగు భూముల యజమానుల మధ్య తరచూ వివాదాలు తలెత్తుతున్నాయని వారు తెలిపారు. దీంతో సాగు పనులకు ఆటంకం కలుగుతోందని, కోర్టు కేసులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.అధికారులు ఆధునిక సర్వే పరికరాలతో భూములను కొలిచి, ప్రభుత్వ రికార్డులకు అనుగుణంగా శాశ్వత హద్దులు నిర్ణయించి, సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని కోరారు ఇలా చేయడం వల్ల భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు గతంలో డి ఐ కి సర్వే చేయాలని వినతి పత్రం ఇచ్చాను ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి, బుధవారం ఏడి సర్వే చేశారు అధికారులు ఎటువంటి పక్షపాతం లేకుండా మా భూమికి హద్దులు నిర్ణయించాలని కోరారు. ఈ సందర్భంగా ఏడి మాట్లాడుతూ సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతు వారి సర్వే నెంబర్ల ఆధారంగా సర్వే నిర్వహించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ చిన్నారిని దీవించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణాకర్



**చిట్యాల. జులై 9 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం లోని గోపాల్పూర్ గ్రామానికి చెందిన జిల్లా సేవాదళ్ అధ్యక్షులు ఏక్ రవీందర్ కుమార్తె నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ కార్యక్రమానికి విచ్చేసి దీవించిన భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ గారు తెలంగాణ రాష్ట్ర ప్రూజజ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ గారు భూపాలపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ బుర్ర కొమురయ్య వారితో చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుట్ల తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య జిల్లా ఉపాధ్యక్షులు వరం సమ్మయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకీ యాదవ్ టేకుమట్ల మాజీ జడ్పిటిసి సభ్యులు పులి తిరుపతిరెడ్డి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూలశంకర్ గౌడ్ ప్రధాన కార్యదర్శి గడ్డం కొమరయ్య ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బొట్ల రవి మాజీ సర్పంచ్ గజ్జి రవి సీనియర్ నాయకులు బుర్ర లక్ష్మణ్ గౌడ్, గుర్రం నరసయ్య నల్ల రాజిరెడ్డి ఏక స్వామి తదితరులు పాల్గొన్నారు**

## ఘనంగా ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవం -జెండావిష్కరణ.



. తొర్రూరు జూలై 9 : జ్ఞానం శీలం ఏకత పరిషత్ ప్రత్యేకత అంటూ క్షణం క్షణం మా కణం కణం భరతమాతకే సమర్పణం అంటూ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతూ కోట్లాది మంది విద్యార్థులకు మార్గం చూపినటువంటి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపి) 78వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈరోజు తొర్రూరు పట్టణంలో స్థానిక దత్తు ఒకేషనల్ జూనియర్ కాలేజి వద్ద ఏబీవీపి తొర్రూరు మండల కన్వీనర్ చిలుక మనోజ్ ఏబీవీపి జెండాను ఆవిష్కరించడం జరిగింది.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949జులై9న డిల్లీ యూనివర్సిటీ లో కేవలం ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపి నేడు ప్రపంచంలో అతి పెద్ద అత్యంత శక్తివంతమైన విద్యార్థి సంఘం గా ఆవిర్భవించింది అని తెలిపారు.దేశంలో ఏ విద్యార్థికి కష్టమొచ్చినా,సమస్య ఉన్నా నేనున్నాను అంటూ ముందుండి పోరాడే ఏకైక సంస్థ అని, కేవలం విద్యార్థుల సమస్యలే కాకుండా దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై, సవాళ్ళను కూడా ఛేదించి జాతి నిర్మాణం కోసం నిస్వార్థంగా కృషి చేస్తున్న ఏకైక సంస్థ ఏబీవీపి అని కొనియాడారు.విద్యార్థుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూనే విద్యార్థులలో దేశభక్తిని ప్రభోధం చేస్తూ, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షిస్తూ ధేశం కోసం ధర్మం కోసం నిరంతరం పనిచేస్తున్నది ఏబీవీపి అని తెలిపారు.హస్టల్ విద్యార్థుల సమస్యలపై పోరు, స్కాలర్షిప్,ఫీజు రీయింబర్స్మెంట్ పై పోరుబాట తో పాటుగా తెలంగాణ ఉద్యమంలో పెద్ద ఎత్తున విద్యార్థులను సమీకరించి అసెంబ్లీ ముట్టడించి విద్యార్థుల సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఏబీవీపి కే దక్కింది అని,విద్యర్థులలోదాగియున్న ప్రతిభను, స్రృజనాత్మకతను వెలికి తీసేవిధంగా అనేక సేవా కార్యక్రమాలు నిరంతరం చేపడుతున్న సామాజిక సంస్థ ఏబీవీపి అని,ఏబీవీపి ఆవిర్భావ దినోత్సవాన్ని జాతీయ విద్యార్థి దినోత్సవంగా ధేశం మొత్తం అనేక కార్యక్రమాలు చేస్తున్నదని,విద్యార్థులు ఏబీవీపి చేపట్టే కార్యక్రమాలలో భాగస్వామ్యులు కావాలని కోరారు.ఈకార్యక్రమంలో ఏబీవీపి సీనియర్ నాయకులు పల్లె కుమార్,పైండ్ల రాజేష్,నూకల నవీన్,సాగర్,భంటి, కార్తీక్, ఉమేష్,అరుణ్, శిరీష,అక్షయ,సౌజన్య,కరుణ,మంజుల,అనిత తదితరులు పాల్గొన్నారు.

మీ-సేవ కేంద్రాల్లోనూ యూరియా బుకింగ్.

# వ్యవసాయ అధికారి కే.రాజు.




బయ్యారం,జులై 9. : బయ్యారం మండలంలోని కొత్తపేట మీ సేవా కేంద్రంలో గురువారం కీప్యాడ్ మొబైల్ ఫోన్‌లు ఉపయోగిస్తున్న రైతులు,మొబైల్ నెట్‌వర్క్ సౌకర్యం లేని గ్రామాలకు చెందిన రైతులకు యూరియా బుకింగ్ విధానంపై అవగాహన కల్పించడంతో పాటు, కొంతమందికి రైతులకు మీ సేవా కేంద్రం ద్వారా యూరియా బుకింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులకు యూరియా బుకింగ్ విధానం, దాని ప్రయోజనాలు,నిర్ణీత సమయంలో ఎరువులను పొందేందుకు బుకింగ్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు.స్మార్ట్‌ఫోన్,మొబైల్ నెట్‌వర్క్ సౌకర్యం లేని రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సమీపంలోని మీ సేవా కేంద్రాలను వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కే.రాజు సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ విధానాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైనప్పుడు మీ సేవా కేంద్రాల ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవాలని కోరారు.

## బాధిత కుటుంబానికి ఎస్.ఎస్.సి బ్యాచ్ పూర్వ విద్యార్థులు.. రూ.7 వేల ఆర్థిక సాయం అందజేత



నర్సింహులపేట జులై 9 మండలం లోని నరసింహాపురం బంజర గ్రామంలో ఇటీవల కట్ల సుగుణమ్మ అనారోగ్య కారణాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న 2008-09 పదవ తరగతి విద్యార్థులు.. ఆమె కుమారుడు నాగరాజు కుటుంబ సభ్యులకు రూ. 7,000 ఆర్థిక సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం పడిశాల ఫౌండేషన్ ద్వారా 25 కేజీల బియ్యంను ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ, ఆర్థిక సాయం చేయడం గొప్పవిషయమని పూర్వపు విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు. ఇందులో వారి స్నేహితులు ఎస్ ఎస్ సి మేకరబోయిన బ్రహ్మేష్, కట్ల పుల్లయ్య, పడిశాల పరశురాములు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలను తనిఖీ ఎంపిడివో..



బయ్యారం,జులై 9:బయ్యారం మండలం జగ్గుతండా పంచాయతీలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఎంపిడివో దీపిక ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలోని ప్రతి తరగతి గదిని సందర్శించి విద్యార్థినులతో ఆప్యాయంగా ముచ్చటించారు.చదువుపైనే పూర్తి దృష్టి సారించాలని,ఉన్నత విద్యతోనే జీవితంలో మంచి అవకాశాలు లభిస్తాయని విద్యార్థినులకు సూచించారు.చదువులో మెళకువలు, లక్ష్య సాధనకు అవసరమైన అంశాలను తెలియజేసి విద్యార్థినుల్లో ఉత్సాహం నింపారు.తనిఖీలో భాగంగా పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఆహార నాణ్యత,పరిశుభ్రతపై ఆరా తీశారు.విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొల్లి జయంతి వెంకట కృష్ణ,కేజీబీవీ పాఠశాల టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

